## జన్మాష్టమి వేడుక...
## జగన్నాథుడి దీవెన



జన్మాష్టమి సందర్భంగా తాండూరులో ఉట్టి కొట్టిన తర్వాత అందులోని ప్రసాదాన్ని తీసుకునేందుకు పోటీ పడుతున్న భక్తులు. కృష్ణుడి వేషధారణలో అలరిస్తున్న చిన్నారి –న్యూస్‌టుడే, తాండూరు టౌన్


# ఈనాడు
# వికారాబాద్

మంగళవారం 15 ఆగస్టు 2017 16 పేజీలు


నిండని చెరువు.. ఉపాధి కరవు! 2

చౌరవ చూపారు.. బస్సులు నిలిపారు 3

మంచుకొండల్లో.. మనోళ్లు 9

## రాష్ట్ర ఉత్తమ తహసీల్దారుగా ఆబెద్‌అలీ



**పరిగి, న్యూస్‌టుడే:** పరిగి తహసీల్దారు ఆబెద్‌అలీ రాష్ట్రస్థాయిలో ఉత్తమ తహసీల్దారుగా ఎంపికయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న షాదీముబారక్, కల్యాణలక్ష్మి, ముటేషన్స్, ఆపద్భందు, సాదాబైనామా, ధ్రువపత్రాల జారీ, ఆరోగ్యశ్రీ వంటి వాటి అమలులో ముందంజలో ఉండటంతో ఈమేరకు ఎంపికయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవ సంబురాల సందర్భంగా జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగే వేడుకల్లో జిల్లా మంత్రి పట్నం మహేందర్ రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నారు.

# ఆర్థిక ప్రగతి... సామాజిక అభివృద్ధి!

- కీలక రంగాల పురోగతిపై దృష్టి సారించాల్సిందే
- ప్రతి ఎకరాకూ నీళ్లందితే సేద్యం బంగారమే
- మహిళా భాగస్వామ్యం పెంచితే మేలు
- నేడు 71వ స్వాతంత్ర్య దినోత్సవం



వికారాబాద్:

**రా**ష్ట్ర రాజధానికి సమీపంలో ఉన్నా... వికారాబాద్ జిల్లా పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతంగానే మిగిలిపోయింది. అయితే... ఇటీవల పునర్విభజన తర్వాత పారిశ్రామికంగా, సేద్యంలోనూ ఎంతో ప్రగతిని సాధించడానికి అవకాశాలు మెరుగుపడుతున్నాయి. రానున్న రోజుల్లో కీలక రంగాల్లో పురోగతి సాధించడానికి ప్రణాళికలు రూపొందించి వాటిని పక్కాగా అమలు చేస్తే ప్రజలకు బంగారు భవిష్యత్తు అందించడానికి వీలవుతుంది. ఈ తరుణంలో ప్రత్యేక దృష్టిసారించి పనులు ముమ్మరం చేస్తే ఆ ఫలాలను జిల్లావాసులకు అందించొచ్చు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో అమలు చేస్తున్న పథకాలను సమర్థంగా అమలు చేస్తూనే... సాంతికేతను ఉపయోగించి మరిన్ని సేవలను ప్రజలకు అందించే విధానాలను మరింత వేగంగా విస్తరించాలి. ప్రధానంగా వ్యవసాయం, పరిశ్రమలు, ఉపాధి కల్పన, మహిళా భాగస్వామ్యం.. ఈ రంగాల్లో ప్రగతికి బాటలు వేస్తే ఎక్కువ మందికి ప్రయోజనం దక్కుతుంది. ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేలా చర్యలుండాలి. నేడు 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'ఈనాడు' అందిస్తున్న కథనమిది...

### జల వనరులకు అమిత ప్రాధాన్యం



తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం జలవనరుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే మిషన్ కాకతీయ పథకాన్ని ప్రవేశపెట్టింది. జిల్లాలో 1207 చెరువులు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 77,583 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. ఈ చెరువులను రానున్న ఐదేళ్లలో పునరుద్ధరించేందుకు ఏటా 20 శాతం ఎంపిక చేసి పునరుద్ధరణకు నిధులు కేటాయిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో **మిగతా 7 లో...**


### తాగునీటికి తీరనున్న తంటాలు



మిషన్ భగీరథలో భాగంగా ఇంటింటికీ కుళాయితో స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం వికారాబాద్ జిల్లాకు రూ.378 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం జిల్లాలో సుమారు 9.5 లక్షల జనాభా ఉన్నారు. వీరి రోజు వారి తాగునీటి అవసరాలు తీర్చడానికి 5,037 చేతి పంపులు, రక్షిత మంచి నీటి పథకాలు 763, సీపీడబ్ల్యూఎస్, పథకాలు 2, ఎంపీడబ్ల్యూఎస్ పథకాలు 155 అందుబాటులో ఉన్నాయి. అయినా వేసవి వచ్చిందంటే భూగర్భ జలాలు అడుగంటి తాగునీటికి తంటాలు తప్పడం లేదు. ఈ ఏడాది చివరికల్లా మిషన్ భగీరథ పనులు పూర్తవుతాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు. రానున్న ఏడాది నుంచి తాగునీటి సమస్యలు అధిగమించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# 450 మంది... రూ.3.37 కోట్లు

- వయస్సు నిర్ధారణ పత్రాల్లేక నిలిచిన చెల్లింపులు
- ధ్రువపత్రాల సమర్పణకు మూడు రోజుల గడువు
- 'తల్లి' చేతికి కల్యాణలక్ష్మి చెక్కు



న్యూస్‌టుడే, తాండూరు గ్రామీణ

**ప్ర**భుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల్లో మరో కీలక మార్పు చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇకపై ఆర్థిక సాయాన్ని వధువు తల్లి పేరిట చెక్కుల ద్వారా అందించేందుకు సమాయత్తం అవుతోంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో పేద యువతుల పుట్టింటివారికి ఊరట లభించనుంది. మరోవైపు ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ... వయస్సు ధ్రువీకరణ పత్రాలు లేక పదుల సంఖ్యలో లబ్ధిదారులకు చెల్లింపులు నిలిచిపోయాయి. మరో మూడు రోజుల్లోగా ధ్రువపత్రాలు సమర్పించేందుకు అధికారులు గడువు విధించారు. లేదంటే నిధులు వెనక్కి **మిగతా 7 లో...**

### పంద్రాగస్టుకు పక్కాగా ఏర్పాట్లు



**స్వా**తంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు. వికారాబాద్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఉత్సవాలకు మంత్రి మహేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈమేరకు ఏర్పాట్లను పాలనాధికారిణి దివ్య, ఎస్పీ అన్నపూర్ణ, సంయుక్త పాలనాధికారి సురేష్‌పొద్దార్, డీఆర్ఓ సంధ్యారాణి కలిసి పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

–న్యూస్‌టుడే, వికారాబాద్‌టౌన్

# నిండని చెరువు.. ఉపాధి కరవు!

☛ జలపుష్పాల వికాసం కష్టమే ☛ మత్స్యకారుల్లో ఆందోళన

న్యూస్‌టుడే, దోమ :

నిరుడు దోమ పెద్ద చెరువు నిండింది. ఆయకట్టు రైతులకు పంట పండింది. మత్స్యకారులు చేపలు పెంచుకునేందకు మంచి అవకాశం చిక్కింది. దీంతో అందరికీ ఉపాధి దొరికింది. వచ్చిన ఆదాయంతో కుటుంబ పోషణకు తిప్పలు తప్పింది. ఆర్థిక అవసరాలు తీర్చు నేందుకు వీలు కలిగింది. పూడూర్ చెరువు సైతం నిరుడు నిండింది. ఆయకట్టు సాగైంది. మత్స్యకారులు చేపలు వది లారు. అందరికీ చేతి నిండా పని దొరికింది. కానీ ఈ ఏడాది ఇప్పటి వరకు కొద్ది నీళ్లు మాత్రమే వచ్చాయి. దీంతో చేపలు వదలలేని పరిస్థితి. ఇక వర్షాలు పడి చెరువులు నిండితే తప్ప ఉపాధి దొరకడం కష్టంగా మారిందని మత్స్యకా ర్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**తప్పని కష్టాలు..:** జిల్లాలో 94 మత్స్యసహకార సంఘాలున్నాయి. 4325 మంది సభ్యులుగా ఉన్నారు. ప్రస్తుతం జిల్లాలో గ్రామ పంచాయతీ చెరువులు 600 ఉన్నాయి. మత్స్యశాఖకు సంబంధించిన చెరువులు 95 వరకు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు చాల చెరువుల్లో నీళ్లులేక చేపలు పెంచడానికి వీలులేకుండా ఉందని మత్స్యకారులు పేర్కొంటున్నారు. ఫలితంగా ఉపాధికి దెబ్బ తగిలిందని వాపోతున్నారు. మూడేళ్ల వరుస (2012 నుంచి 2015) కరవుతో జిల్లాలో మత్స్య కార్మికులకు విలవిల్లాడుతున్నారు. నిరుడు మాత్రం రాష్ట్రమంతటా విస్తారంగా వర్షాలు కురిశాయి. కానీ పరిగి డివిజన్‌లోని కుల్కచర్లలో తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ మండలంలో ఒక్క చెరువు కూడా నిండలేదు. దోమలో ఏ చెరువూ.. పూర్తిస్థాయిలో నిండలేదు. దీంతో కర్షకులకు, మత్స్యకార్మకులు ఉపాధి కరవైంది. బతుకు భారమైంది. ఏం చేయాలో తోచని కొందరు రైతులు పొట్ట చేతపట్టుకుని వసల బాట పట్టారు. కొడంగల్ డివిజన్‌లోని దౌల్తాబాద్ మండ లంలోనూ వర్షపాతం మరీ అధ్వానంగా మారింది. ఫలితంగా నీటి వనరుల్లో చుక్కనీరు లేక పంట పొలాలు బీళ్లుగా మారాయి. మత్స్య కార్మికులకే కాదు మూగజీవాలకు తాగునీరు లేక తల్లడిల్లాయి.

**నిండని జలవనరులు:** ★ పరిగి డివిజన్‌లోని పాలేపల్లి చెరువు నిరుడు నిండ



నీరు చేరని పాలేపల్లి చెరువు

లేదు. దీంతో మత్స్యకారులకు ఆర్థికంగా నష్టం తప్పలేదు. ఈ సారైనా నిండు తుందని ఆశిస్తూ ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే రెండు న్నర నెలలు పూర్తయింది. కానీ ఒక్క భారీ వర్షం కురువలేదు. నీరు చేరలేదు. ఈ ఏడాది కూడ నిండకుంటే మత్స్యకారులు, ఆయకట్టు రైతులు ఆగం కావల సిందేనని పేర్కొంటున్నారు. ఇదే మండలంలోని దిర్సంపల్లిలోని రాట్నాల చెరువు, కుల్కచర్ల మండలం కుసుమ సముంద్రం, దండెం చెరువు, బాసుపల్లి కొత్త చెర వుల్లోకి నీరు చేరలేదు.

★ కొడంగల్ డివిజన్‌లోని ఏర్పుమళ్ల కాకర వాణి ప్రాజెక్టు నిరుడు నిండింది. చేపలు వదిలి ఉపాధి పొందారు. కానీ ఈ ఏడాది సరైన వర్షాలు లేక చుక్కనీరు రాలేదు. దీంతో నీరులేక వెలవెల బోతుంది. గండ్లకుంట, ఊరచెరువు, సుద్దకుంట, గన్నెరు కుంటలోకి నీరు రాలేదు.

★ బొంరాస్‌పేట పెద్ద చెరువులో నిరుడి చేరిన పాతనేరే ఉంది.

**రుతుపవనాలు దోబూచులాడుతున్నాయి..**

**–అనంతయ్య, మత్స్య సంఘం జిల్లా డైరెక్టర్**

నిరుడు దోమ పెద్ద చెరవులో 3లక్షల చేపపిల్లలు వదిలాం. దోమ మత్ససహకార సంఘం సభ్యులు ఉమ్మడి కృషితో వారంతపు సంతలు తిరిగి విక్రయించారు. సంఘంలోని కార్మికులకు ఉపాధి దొరికింది. ఇంకా ప్రభుత్వ గుర్తింపు పొందేందుకు సంఘాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అప్పడే ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ పొంద డానికి వీలు అవుతుంది. ఈ ఏడాది రుతుపవ నాలు దోబుచులా డుతుండడంతో సరైన వర్షాలు పడక చెరువు నిండలేదు. దీంతో మత్స్య కార్మి కులకు ఆందోళన కల్గిస్తుంది. ఈ పరిస్థితి ఇలాగే ఉంటే భవిష్యత్ కష్టమే.

**92 లక్షల చేపపిల్లలు లక్ష్యం:** –వెంకటేశం, జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు

ఈ ఏడాది చెరువులు నిండితే 92 లక్షల చేపపిల్లల్ని పెంచ డానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఇందుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయింది. కానీ వర్షం లేక చెరువుల్లో నీరు చేరక ఊరుకున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాలి. లేకుంటే మత్స్యకారులకు ఆర్థిక ఇబ్బందులు తప్పవు. ప్రతి మత్స్య కార్మికుడు తప్పని సరిగా బీమా చేయించుకోవాలి. ప్రమా దవశాత్తు ఏం జరిగినా కేంద్ర ప్రభుత్వం రూ.3లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ2లక్షలు కలిపి మొత్తంగా రూ5లక్షలు చెల్లి స్తుంది. వర్షాలు పడే వరకు వేచిచూసే దోరణి అవలం బిస్తాం. లేకుంటే ప్రత్యామ్నాయం (నీటి గుంతల్లో చేపపిల్లల పెంపకం)కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరుతాం.

**చేపపిల్లలు సిద్ధం..**

**–రసీదు. మత్స్యశాఖ అధికారి**

చేపపిల్లలు వదలడానికి సిద్ధంగా ఉన్నాం. కానీ చెరువుల్లో నీల్లు లేవు. నీల్లు చేరి ఉంటే అందుకు సంబంధించి తహసీల్దార్, నీటి పారుదలశాఖ నుంచి మత్స్యసహ కార సంఘాలు లేటర్ తీసుకవస్తే నీటి విస్తీర్ణం బట్టి వదిలేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటి వరకు సంఘాల నుంచి నీళ్లు ఉన్నట్లు ఎవరినుంచి ప్రతిపాదనలు రాలేదు. విషయం పాలనాధికారికి తెలిపాం. వర్షాలు పడితే చూద్దా మన్నారు.

# 'ట్రాఫికర్'తో వాహనదారుల తిప్పలు

● నాలుగు రోజులుగా ఇదే దుస్థితి

● ఎల్బీనగర్‌లో గంటల తరబడి ట్రాఫిక్ జామ్

**ఎల్బీనగర్, న్యూస్‌టుడే :** ఏ కూడలిలో అయినా ట్రాఫిక్ సిగ్నల్ పడితే మూడు, నాలుగు నిమిషాల పాటు వేచి ఉండాలంటేనే విసుగు చెందుతాం. అదే గంటల తరబడి ట్రాఫిక్ స్తంభిస్తే ఎలా ఉంటుందో ఒక్క సారి ఊహించండి.. గత నాలుగు రోజులుగా విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 65)లోని ఎల్బీనగర్ చౌరస్తా నుంచి చింతలకుంట చౌరస్తా వరకు ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు గంటల సమయం రోడ్డుపై ఉండాల్సి వస్తోంది. ద్విచక్ర వాహనదారులు కూడా ముందుకు వెళ్లే పరిస్థితి లేకుండా పోతోందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు వాహనదారులు, ప్రయాణికులు ఈ ప్రాంతంలో చుక్కలు చూడాల్సి వస్తోందని వాపోతున్నారు.

**సమస్యకు కారణాలెన్నో..**

నిత్యం వేలాది వాహనాలు తిరిగే జాతీయ రహదారి కావడం.. చింతల్‌కుంట వద్ద అండర్ పాస్ మార్గం పనులు కొనసాగుతుండడం.. మరో పక్క రోడ్డు విస్త రణ, ఇంకో వైపు మెట్రో పనులు జరుగుతుండడంతో వాహనదారులు ట్రాఫిక్ సమ స్యతో అల్లాడాల్సి వస్తోంది. అటు హయత్‌నగర్ వైపు, అటు ఎల్బీనగర్ చౌరస్తా వైపు బారీ కేడ్లు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో కొన్ని దుకాణాల వద్ద వాహనాలు నిలిపుతుండడంతో సమస్యలు రెట్టింపవుతున్నాయి. ఈ ప్రాంతాల్లో రహదారి ఇరుకుగా ఉండడంతో పాటు రోజూ వేలాది వాహనాల రాక పోకలతో రద్దీ నెలకొంటోంది. వాహనాల రాకపోకల క్రమబద్ధీకరణకు ట్రాఫిక్ పోలీ సులు శ్రమిస్తున్నా సమస్య తీరడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. అండర్ పాస్ నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతుండడంతో ఈ ట్రాఫిక్ నరకం ఇంకెన్నాళ్లు భరించాలోనంటూ వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు అడపాదడపా కురుస్తున్న వర్షాలతోనూ రోడ్డుపై వాహనాలు నెమ్మ దిగా కదులుతూ తరచూ ట్రాఫిక్ జామ్ సమస్యకు దారితీస్తోంది. ఇప్పటికైనా అధి కారులు దృష్టి సారించి ఈ ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

# గుర్తుతెలియని యవకుడి హత్య!

**అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే :** నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండ లంలో వెలుగు చూసిన ఓ దారుణ హత్యోదంతం తీవ్ర కలకలం రేపింది. గుర్తు తెలియని యువకుడిని దుండగులు దారుణంగా అంతమొందించి బండరాయి కట్టి చెరువులో పడేసిన ఘటనతో ప్రజలు ఉలిక్కి పడ్డారు. పోలీసులు, స్థాని కుల కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడ పంచాయతీ పరిధి ఇనాంగూడ గ్రామంలోని భైరన్‌ఖాన్ చెరువులో ఓ వ్యక్తి మృతదేహం తేలు తున్నట్లు స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం ఉదయం అక్కడకు చేరుకొని పరిశీలించారు. ఇటీవల ఓ సినిమా చిత్రీకరణకు చెరువులో కర్రలు, చెక్కలతో కట్ట నుంచి లోతు ప్రాంతం వరకు ఓ వంతెన నిర్మిం చారు. హంతకులు ఈ వంతెన మీదుగా మృతదేహాన్ని చెరువులోకి తీసుకెళ్లి మృతదేహాన్ని పడేశారు. మృతుడి కాళ్లకి బండరాయి కట్టి ఉన్నట్లు గుర్తించారు. మృతుడి వయసు సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండవచ్చు. యువకుడి దుస్తులు తీసేసి.. కాళ్లకు, మెడకు తాగుతో బిగించి బండరాయిని కట్టి నీటిలో ముంచినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి చేతిపై వీ.ఎం.స్వాతి అని పచ్చ బొట్టు ఉంది. హత్య జరిగి నాలుగైదు రోజుల అయి ఉండొచ్చని పోలీసులు భావి స్తున్నారు. ఘటనా స్థలాన్ని హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌గౌడ్ సందర్శించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

# తీరనున్న రైల్వే వెతలు

● రూ. 6 కోట్లతో నాలుగో ఫిట్‌లైన్ నిర్మాణ పనులు

● మరికొద్ది రోజుల్లో అందుబాటులోకి

**న్యూస్‌టుడే, కాచిగూడ:** కాచిగూడ రైల్వే స్టేషన్‌లో రైళ్లను నిలిపి ఉంచడానికి సరిపడా ఫిట్‌లైన్లు లేకపోవడం వల్ల ఇక్కడి నుంచి వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఖాళీగా బొల్లారం తదితర స్టేషన్లకు తీసుకెళ్లి వెనక్కి తిరిగి తీసుకొస్తున్నారు. దీంతో సమయం, ఇంధనం, మానవ వనరుల సేవలు వృథా అవుతున్నాయి.

★ కాచిగూడ స్టేషన్‌లోని రైళ్లను ఫలక్‌నుమా, ఉందానగర్, బొల్లారం, మేడ్చల్, క్యాలవరీ బ్యారక్స్ తదితర స్టేషన్లలో నిలిపి ఉంచి తర్వాత తిరిగి తీసుకురావాల్సిన దుస్థితి నెలకొంది.

★ మరికొద్ది రోజుల్లో సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. నిర్మాణం చేపట్టిన నాలుగో ఫిట్‌లైన్ మరికొద్ది రోజుల్లో వినియోగంలోకి రానుంది. కాచిగూడ రైల్వే స్టేషన్‌లో రైళ్లను నిలిపి ఉంచడానికి చాలినన్ని ఫిట్ లైన్లు లేకపోవడం వల్ల కొన్నేళ్లుగా పలు రైళ్లను ఇతర చిన్న చిన్న స్టేషన్లలో నిలిపి ఉంచాల్సి వస్తోంది. నగరంలోని ముఖ్యమైన రైల్వే స్టేషన్లలో కాచిగూడ ఒకటి. దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ పరిధిలోకి వచ్చే కాచిగూడ స్టేషన్‌పై ఉన్నతాధికారులు మొదటి నుంచి సవతి తల్లి ప్రేమ చూపుతున్నారు. దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడులోని ముఖ్య నగరాల నుంచి పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉత్తరాది రాష్ట్రాలకు వెళుతాయి. వీటికి కాచిగూడ స్టేషన్‌లోనే హాల్ట్ సదుపాయం కల్పించారు. ఇక్కడి నుంచే రాయలసీమ మీదుగా పలు రైళ్లు నడుస్తున్నాయి. కాచిగూడ స్టేషన్ నుంచి దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్‌కు ఏటా రూ.100 కోట్లకుపైగా ఆదాయం వస్తుంది. ఈ ఆదాయంలో 10 శాతం నిధులను కూడా ఈ స్టేషన్ అభివృద్ధి కోసం ఖర్చు చేయకపోవడం విమ ర్శలకు కారణమవుతోంది. అత్యంత ప్రాధాన్యమైన కాచిగూడ స్టేషన్‌లో రైళ్లను నిలిపి ఉంచడానికి ఫిట్‌లైన్లు లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందుల దృష్ట్యా పదిహేను నెలల ఏడాది క్రితం నాలుగో లైన్ నిర్మాణ పనులు చేపట్టారు.



రైల్వే స్టేషన్లో కొనసాగుతున్న ఫిట్‌లైన్ పనులు

**50 కిపైగా రైళ్లు**

నగరంలోని సికింద్రాబాద్ స్టేషన్ తర్వాత కాచిగూడకు రెండో స్థానంలో ఉంది. ఈ స్టేషన్ నుంచి ప్రతి రోజు 50 కిపైగా ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్, ఎంఎంటీఎస్ రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. వీటి ద్వారా 40 వేల మందికిపైగా ప్రయాణికులు నిత్యం తమ తమ గమ్యస్థానాలకు చేరుతుంటారు. ఇంటర్‌సిటీ అకోలా, చెన్నై ఎగ్మోర్, బెంగళూర్, వెంకటాద్రి, యశ్వంత్‌పూర్, మధురై, మంగళూర్, నాగర్‌కోయిల్, ఏపీ సంపర్క్ క్రాంతి తదితర ఎక్స్‌ప్రెస్ టాటానగర్, కాకినాడ, కృష్ణరాజపుర తదితర వారాంతపు స్పెషల్స్, మహబూబ్‌నగర్, కర్నూలు, గుంతకల్లు, గుంటూరు, మిర్యాల గూడ, నిజామాబాద్, రాయచూర్ తదితర ప్యాసింజర్ రైళ్లను నడుపుతున్నారు. వీటితోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు కర్ణాటక సంపర్క్ క్రాంతి, నాగర్‌సోల్, కొంగు, వైనగంగ, లక్నో, ఇండోర్, మహారాష్ట్ర నుంచి తిరుప తికి అమరావతి తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలతో కాచిగూడ స్టేషన్ రద్దీగా ఉంటుంది. కాచిగూడ స్టేషన్‌కు ఏటా రూ.100 కోట్లపైగా వస్తున్న ఆదాయం దృష్ట్యా కాచిగూడకు 'ఏ వన్' స్టేషన్ హోదా కల్పించారు.

**సుదీర్ఘ నిరీక్షణ తర్వాత**

కాచిగూడ రైల్వే స్టేషన్‌లో రైళ్లను నిలిపి ఉంచడానికి అవసరమైన మూడు ఫిట్ లైన్లకు తోడు కొత్తగా నాలుగో లైన్‌ను నిర్మించాలని ఐదేళ్ల క్రితమే దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ అధికారులు ప్రతిపాదించారు. ఎట్టకేలకు ఏడాదిన్నర క్రితం నాలుగో ఫిట్‌లైన్ నిర్మాణం కోసం టెండర్లను పిలిచారు. రూ. 6 కోట్లకు పనులను దక్కించుకున్న గుత్తేదారు 2016 మే నెలలో పనులను ప్రారంభించారు. భారీ వర్షాల కారణంగా పలుమార్లు పనులు నిలిచిపోయాయి. రైల్వే హైదరాబాద్ డివిజన్ ఉన్నతాధికారుల సందర్శన, ఎప్పటికప్పుడు నిర్వహించిన సమీక్షల అనం తరం పనులు పురోభివృద్ధిని సాధించాయి. నాలుగో ఫిట్‌లైన్ నిర్మాణం పనులు మరికొద్ది రోజుల్లో పూర్తి కానున్నాయి. ఈ లైన్ నిర్మాణం పూర్తయితే మరిన్ని కొత్త రైళ్లు కాచిగూడ స్టేషన్‌కు వచ్చే అవకాశం ఉంది.

**ఇబ్బందులు తొలగిపోతాయి**

**–అరుణ్‌కుమార్‌జైన్, డీఆర్‌ఎం, రైల్వే హైదరాబాద్ డివిజన్**

కాచిగూడ రైల్వే స్టేషన్‌లో రైళ్లను నిలుపడానికి సరిపడా ఫిట్‌లైన్లు లేకపో వడం వల్ల పక్క స్టేషన్లలో నిలపాల్సి వస్తోంది. దీంతో సమయంతోపాటు ఇంధనం వృథా అవుతోంది. మరికొద్ది రోజుల్లో నాలుగో ఫిట్‌లైన్ నిర్మాణం పూర్తవుతుంది. ఇది వినియోగంలోకి వస్తే ఇబ్బందులు తొలగిపోతాయి.

# చొరవ చూపారు... బస్సులు నిలిపారు!


బస్టాండ్‌లోకి ప్రయాణికుల రాకపోకలు

న్యూస్‌టుడే, కుల్కచర్ల గ్రామీణ

ఎక్కడపడితే అక్కడ వాహనాల నిలపడం, వర్షంలో బస్సుల కోసం వేచి చూడటం, సమయానికి బస్సు వస్తుందో లేదో తెలియని పరిస్థితి. ఇవన్నీ కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో నిత్యం కనిపించే దృశ్యాలు. బస్టాండ్ అందుబాటులో లేకపోవడంతో కొన్ని సంవత్సరాలుగా ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎట్టకేలకు ఈ సమస్యలన్నింటికీ తెర పడింది. నూతనంగా కుల్కచర్ల మండల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన చంద్రకాంత్‌కు వచ్చిన ఆలోచనతో నేడు ప్రయాణికుల ప్రాంగణం కళకళలాడుతూ కనిపిస్తుంది. వివరాల్లోకి వెళ్తే..



### ఆరంభం నుంచీ నిరుపయోగమే...

మండల కేంద్రంలోని ప్రయాణికుల ప్రాంగణం ఆరంభం నుంచి నిరుపయోగంగానే ఉంది. చాలా మంది బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకు రావాలని చేసిన ప్రయత్నాలన్నీ బుట్టదాఖలయ్యాయి. తప్పని సరై ప్రయాణికులు ఎక్కువగా ప్రైవేటు వాహనాలను ఆశ్రయించడం ద్వారా బస్సులు కూడా ప్రైవేటు వాహనాలు నిలిచే చోటే ఆగాల్సిన పరిస్థితి ఉండేది. దీంతో బస్టాండ్‌లో బస్సులు నిలవడం మానేశాయి. గతంలో ఆర్టీసి అధికారులు పలు మార్లు బస్టాండ్‌లోనే బస్సులను ఆపే ప్రయత్నం చేశారు. కానీ బస్సుల కంటే ముందుగా ప్రైవేటు వాహనాలు ప్రయాణికులను ఎక్కించుకోవడంతో బస్సులన్నీ ఖాళీగానే వెళ్ళేవి. ప్రైవేటు వాహనాలను ఎక్కడపడితే అక్కడ రోడ్డుపై ఆపేవారు. ఫలితంగా ద్విచక్ర వాహనాలు రోడ్డుపై వెళ్ళాలంటే ఎన్నో ఇబ్బందులు ఉండేవి.

### ఎప్పటికప్పుడు సీసీ కెమెరాలో పర్యవేక్షణ....

నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రధాన చౌరస్తాలో వాహనాలు ఆపితే వారికి జరిమానాలు విధిస్తామని ప్రైవేటు, ఆర్టీసి వారికి ఎస్ఐ సూచనలు ఇచ్చారు. అంతేకాకుండా పోలీస్ స్టేషన్ నుంచే సీసీ కెమెరాల ద్వారా ఎస్ఐ పర్యవేక్షణ చర్యలు చేపడుతున్నారు.

## ఎస్ఐ సహకారం.. ఏళ్ళ నాటి సమస్యకు పరిష్కారం

### మొత్తం మారింది...

ప్రయాణికుల కష్టాలు, వాహనాల ఇష్టారాజ్యం ఇక్కడ నిత్యకృత్యంగా మారడాన్ని ఎస్ఐ చంద్రకాంత్ ప్రత్యక్షంగా చూశారు. సమస్యకు కారణాలేంటని ఆరా తీశారు. దీనికి పరిష్కార మార్గం కనిపెట్టాలని పరిపరి విధాలుగా ఆలోచించి బస్సులు, ఇతర వాహనాలు ఆర్టీసి బస్టాండ్ ఆవరణలోనే నిలపాలని సూచించారు. అంతేకాదు ప్రధాన చౌరస్తాలో ఎట్టి పరిస్థితిలలోనూ ప్రైవేటు వాహనాలు, బస్సులు అపరాదని నిబంధన అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన వాహన చోదకులకు అవగాహన కల్పించారు. దీంతో నెమ్మదినెమ్మదిగా ఒక్కొక్క బస్సు బస్టాండ్‌కు రావడం ఆరంభమైంది. బస్సుల రాకతో కళకళలాడుతున్న బస్టాండును చూసిన ప్రయాణికులు, స్థానికులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రమాదాల నివారణే లక్ష్యం

– చంద్రకాంత్, ఎస్ఐ, కుల్కచర్ల

రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా అన్ని చర్యలు చేపడుతున్నాం. ఎలాగైనా బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలనుకున్నాం. ప్రైవేటు వాహన చోదకుల నుంచి కూడా మంచి సహకారం అందింది. ప్రస్తుతం ట్రాఫిక్ సమస్య మెరుగు పడింది.

# సేద్యపు కుంట.. సాగుకు నిశ్చింత..!

## వర్షాలతో నిండిన తీరు • పెరుగుతున్న భూగర్భ జలాలు


సేద్యపుకుంటలో నిలిచిన నీరు

న్యూస్‌టుడే, ధారూర్

వేసవిలో తవ్విన సేద్యపు కుంటలు ఇప్పుడు అన్నదాతలకు ఆదెరవుగా నిస్తున్నాయి. ఇటీవల వర్షాలకు వాటిలో నీరు చేరడంతో పాటు పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరుగుతున్నాయి. దీంతో ఆయా కుంటల కింద సాగు నల్లేరు మీద నడకలా సాగిపోతోందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పొలంలో ఓ సేద్యపు కుంట ఉంటే.. నీటికి వెతలు ఉండవని పేర్కొంటున్నారు. ధారూర్ మండలం రుద్రారం గ్రామంలో మొత్తం 18 శ్రమ శక్తి సంఘాలు ఉండగా గడిచిన వేసవిలో 17 సేద్యపు కుంటలు తవ్వారు. కేవలం సేద్యపు కుంటపైనే ఆధారపడి ఓ రైతు 3 ఎకరాల్లో పంటలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సేద్యపు కుంట ఉంటే నిటికి నిశ్చంతని నిరూపిస్తున్నారు.

### 3ఎకరాల్లో పంటల సాగు..

గ్రామానికి చెందిన రైతు అంజయ్య ఉపాది హామీ కింద పొలంలో సేద్యపు కుంట గడిచిన వేసవిలో తవ్వించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ కుంటల్లో నీరు చేరాయి. దీంతో ఒకప్పుడు చుక్కనీరు ఉండని బోరు బావిలోనూ సమృద్ధిగా జలాలు వస్తున్నాయి. దీంతో తనకున్న 3 ఎకరాల పొలంలో వరి, పత్తి సాగు చేశారు. గత 15 రోజులుగా వర్షాలు కురియక పోవడంతో చుట్టుపక్కల రైతుల పొలాల్లో పంటలు ఎండుముఖం పట్టాయి. ఆయన పొలంలో వేసిన పత్తి, వరి పంటలకు బోరు, సేద్యపు కుంటలోని నీటిని పారించడంతో మొక్కలు కళకళలాడుతూ ఉన్నాయి. పంటలకు పురుగు మందు పిచికారి చేయడానికి సైతం కుంట నీటినే వినియోగిస్తున్నానని, ఆవులు గేదెల తాగు నీటి కోసం వినియోగిస్తున్నామని అంజయ్య పేర్కొంటున్నారు.


వరినారు పెంచుతున్న రైతు అంజయ్య

### వృథా కాదు.. నీటి తావి: అంజయ్య, రైతు, రుద్రారం

సేద్యపు కుంటలు తవ్వడం వలన భూమి వృథా అవుతుందని చాలా మంది రైతులు భావిస్తుంటారు. ఇది సరికాదు. కొద్ది భూమి నీటి నిల్వకు ఉపయోగించుకుంటే మిగిలిన భూమిలో బంగారు పంటలు పండించుకోవచ్చు. రైతులు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలి. ప్రతి రైతు సేద్యపు కుంట తవ్వుకోవాలి.

# ఆశల 'విరులు' పూచేనా?

## • పూలసాగువైపు రైతులు చూపు
## • అధికారులు సహకరిస్తే.. లాభాల గుబాళింపు సాధ్యమే

న్యూస్‌టుడే, పరిగి

దశాబ్దాలుగా సంప్రదాయ పంటల సాగుతో ఆర్థికంగా నష్టపోతున్న రైతులు పూల సాగుపై దృష్టి సారించారు. రెక్కలు ముక్కలు చేసుకుని సాగు చేస్తున్నా.. ఆశించిన దిగుబడులు రాకపోవడంతో దిగాలు చెందుతున్నారు. సాగులో మెళకువలు తెలియక పోవడం, నాణ్యమై విత్తనాలు, నారు దొరక్కపోవడంతో పడరాని పాట్లు పడుతున్నారు. శ్రావణ మాసం సందర్భంగా ఆలయాల్లో ఎక్కడ చూసినా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పూల విక్రయాలతో ఆర్థికంగా నిలదొక్కుకుందామని ఎంతో ప్రయత్నిస్తున్నారు. కానీ చివరకు వారి ఆశలు నిరాశే అవుతున్నాయి.

**ఇదిగో ఇలా..:** పరిగి నియోజకవర్గంలోని పూడూరు, కండ్లపల్లి, మీర్జాపూర్, కొత్తపల్లి ఎన్కెపల్లి, శేరిగూడ, పొతిరెడ్డిగూడ, అంగడిచిట్టంపల్లి, మన్నెగూడ, చీలాపూర్, సుల్తాన్‌పూర్, రూప్‌ఖాన్‌పేట, పరిగి, సుల్తాన్‌నగర్, నస్కల్ తదితర గ్రామాల్లో పూల సాగు చేస్తున్నారు. వర్షాకాలం సీజన్‌లో చామంతి, బంతి, హస్టల్, గులాబీ, ఎర్రబంతితో పాటు రకరకాల పూలను సాగుచేస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా క్రమేపి అన్నికాలాలోన్లూ రైతులు ఎక్కువగా పూల సాగుపై దృష్టి సారించారు. ఆయా ప్రాంతాల్లో సుమారు వంద ఎకరాలకు పైగా పూలను సాగు చేస్తున్నారు. ప్రతి కాలంలోనూ పూలను అమ్మేందుకు రైతులు నగరంలోని మోజంజాహీ మార్కెట్, గుడిమల్కాపూర్, మెహిదీపట్నం, లంగర్‌హౌస్ ప్రాంతాల్లోని విపణికి వెళ్లి అక్కడ కమిషన్ ఏజెంట్ల వద్ద అమ్మకాలకు ఉంచుతారు. ప్రత్యేక రవాణా సౌకర్యం లేక రైతులు పంటను తరలించేందుకు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. పూలను తీసుకువచ్చేందుకు ఉదయం తెల్లవారిందే మొదలుకుని ఇంట్లో అంతా పొలం బాట పడుతున్నారు. పొలం నుంచి నేరుగా రహదారి వరకు కొందరు తలపైన



గులాబీ తోటకు ట్యాంకరు ద్వారా అందిస్తున్న నీరు

మోసుకుంటూ రాగా మరికొందరు రైతులు ద్విచక్రవాహనాలపై తీసుకువస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఎక్కించేందుకు సమీపంలోని గేట్లవద్దకు వెళ్లి బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ఇలా రెండు మూడు ప్రాంతాలకు మారే సరికి పూల నాణ్యత దెబ్బతింటోంది.

**తగ్గిన దిగుబడులు:** పూలసాగు చేపట్టిన రైతులకు నష్టాలే వస్తున్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఈసారి దిగుబడులు చాలా వరకు పడిపోయాయి. హైదరాబాద్ నగరంలోని వివిధ విపణిలకు తరలిస్తే దళారుల బెడదతో ధర కూడా ఆశించిన స్థాయిలో రావడంలేదు. జిల్లా నుంచి పూలను తరలించేందుకు ఒక్క మూటకు ఆర్టీసీ బస్సులో అయితే రూ.50 నుంచి రూ.60 వరకు రవాణా ఛార్జీలు వసూలు చేస్తున్నారు. పూడూరు నుంచి హైదరాబాద్ ప్రాంతం నానల్‌నగర్ స్టేజీవద్ద బస్సుదిగి గుడిమల్కాపూర్ విపణికి వెళ్లేందుకు ఆటోల్లో వెళ్లాల్సిందే. అక్కడ అందుకు అదనంగా ఒక్కో మూటకు సైజును బట్టి రూ.30 నుంచి రూ.40 వరకు తీసుకుంటారు. విపణిలో అమ్మిన తరువాత కమిషన్ ఏజెంట్లు వందకు రూ.10 కమీషన్ తీసుకుని రైతుల చేతికి పట్టీలు అందిస్తున్నారు. ఒకరైతు నగరంలోని విపణికి పూలను తీసుకెళ్లి మళ్లీ ఇంటికి తిరిగి వచ్చేవరకు అదనంగా ఒక్కరికి రూ.200 నుంచి రూ.300 వరకు ఖర్చవుతోందని ఆందోళన చెందుతున్నారు.


సాగులో ఉన్న బంతి

### నాణ్యమైన నారు దొరకడం లేదు

ఎం.శేఖర్, రైతు, సుల్తాన్‌పూర్

అరెకరం విస్తీర్ణంలో గులాబీ పూల సాగు చేపట్టేందుకు నాలుగు నెలల కిందట షాద్‌నగర్ నుంచి నారు తెప్పించా. పూలు మాత్రం మొక్కకు ఆశించిన స్థాయిలో పూయడం లేదు. ఇతర చోట్ల చూస్తే మొక్క నిండుగా మొగ్గలే కనిపిస్తుండగా ఇక్కడ మాత్రం రెండు మూడు పూల కన్నా ఎక్కువ రావడం లేదు.

### కొరవడ్డ సూచనలు, సలహాలు

పూల రైతులకు క్షేత్రస్థాయిలో సూచనలు, సలహాలు కొరవడ్డాయి. ఉద్యానవన శాఖ అధికారులు ఎక్కడ ఉంటారో కూడా రైతులకు తెలియడం లేదు. స్థానికంగా కార్యాలయం లేకపోవడంతో ఎవరిని సంప్రదించాలో అర్థం కావడం లేదు. నారుమళ్ల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులు, సాగులో మెళకువలు తెలియక ఆర్థికంగా నష్టపోతున్నారు. మండల సర్వసభ్య సమావేశంలోనే అధికారులు కనిపిస్తున్నారు తప్ప గ్రామాల్లో తిరగడం లేదని సర్పంచులు వాపోతున్నారు. కనీసం నాణ్యమైన నారుమళ్ల సమాచారాన్ని పంచాయతీ కార్యాలయాల్లో ఉంచాలని డివిజన్ రైతులు కోరుతున్నారు. పరిగి మార్కెట్లో కిలో కనకాంబరాలు రూ.400 నుంచి రూ.600, గులాబీ రూ.180 నుంచి రూ.200, చామంతి రూ.300 నుంచి రూ.400, బంతి రూ.150, మల్లె పూలు రూ.550 నుంచి రూ.600 వరకు విక్రయిస్తున్నారు. వ్యాపారులు పరిగి నుంచి వెళ్లి గుడిమల్కాపూర్‌లో కొనుగోలు చేసి స్థానికంగా విక్రయిస్తున్నారు. రవాణా భారం రూ.300 మోయాల్సి వస్తోంది. స్థానికంగా పూలసాగు విస్తీర్ణం పెరిగితే తమకు ఎంతో మేలని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.

# పరిగి

## 16 నుంచి నిరవధిక సమ్మె

కుల్కచర్ల: తపాలా ఉద్యోగుల న్యాయమైన సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏఐజీడీఎస్‌యూ జిల్లా ట్రెజరర్ వెంకటేష్, కుల్కచర్ల మండల అధ్యక్షులు మిషన్ వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 16 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు పేర్కొన్నారు. వేతనాల పెంపుదలలో మొండి వైఖరిని ప్రదర్శిస్తోందని, ఎన్నో ఏళ్ల నుంచి వెట్టిచాకిరీ చేయించుకుంటోందని అన్నారు.

## యువసేన ఆధ్వర్యంలో వేడుకలు

పరిగి, న్యూస్‌టుడే: మండల ముదిరాజ్ యువసేన ఆధ్వర్యంలో హైదరాబాద్ తొలి మేయర్ కృష్ణస్వామి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముదిరాజ్ యువసేన నాయకులు బాబయ్య, అనిల్‌కుమార్, బాబు, రమేష్ మాట్లాడుతూ... దూరదృష్టితో పనిచేసి ప్రజా మన్ననలు పొందిన మహనీయుడు కృష్ణస్వామి అని పేర్కొన్నారు.



సమ్మెలో కార్మికులు

## కాలుతున్న నియంత్రికలు..
# కష్టాల్లో కర్షకులు!

- రోజు రోజుకు పెరుగుతున్న వినియోగం
- ఆందోళనలో వినియోగదారులు

పరిగి, న్యూస్‌టుడే:

విద్యుత్తు వినియోగం రోజు రోజుకూ పెరుగుతుంది. వ్యవసాయానికి మాత్రమే కాకుండా... నిత్య జీవిత అవసరాలకూ కరెంటు అత్యవసరమైంది. చిన్న వ్యాపారుల మొదలు, పలు కంపెనీలు కూడా రెప్పపాటు విద్యుత్తు లేకున్నా.. విలవల లాడుతున్నారు. అయితే నిత్యం నియంత్రికల మొరాయింపు వినియోగదారుల్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

### పెరుగుతున్న వినియోగం..

వర్షాభావ పరిస్థితుల కారణంగా విద్యుత్తు వినియోగం రోజు రోజుకు పెరుగుతోంది. దీంతో వినియోగదారులు పడరాని పాట్లు పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ వర్షాలు కురియ లేదు. బోరు బావుల్లోనూ నీటి మట్టం గణనీయంగా పడిపోవడంతో వినియోగం అధికమైంది. వరి మినహా ఇతర పంటలు గత నెలలోనే పూర్తయ్యాయి. నీటి సదుపాయం కలిగిన రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు. ఇదే సమయంలో నియంత్రికల మరమ్మతు విభాగంలో పని చేస్తున్న కార్మికులు తమ సమస్యలు పరిష్కరించే వరకు పని చేసేది లేదని సమ్మెకు దిగారు. దీంతో ఇటు అధికారులు, అటు అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటివరకు మరమ్మతు చేసి ఉంచిన వాటిని అధికారులు పంపిణీ చేస్తున్నారు. అవి కాస్త పూర్తయ్యాక ఏం చేయాలో పాలుపోవడం లేదు. తాము 18ఏళ్లుగా పనిచేస్తున్నా కనీస వేతనాలు ఇవ్వడం లేదని కార్మికులు ఆందోళన బాట పట్టారు.

### కాలిపోతున్న తీరు..

పరిగి మరమ్మతు కేంద్రం పరిధిలో పరిగి, దోమ, కుల్కచర్ల మండలాలున్నాయి. ఆయా ప్రాంతాల్లో సుమారు 13,604 వ్యవసాయ కనెక్షన్లు ఉండగా దాదాపు 3200 నియంత్రికలు ఉన్నాయి. పెరిగిన వినియోగంతో రోజూ కాలిపోవడంతో కలవరం మొదలైంది. గత నెలలో గండేడ్ మండలంతో కలిపి 45 నియంత్రికలు మరమ్మతుకు గురికాగా ఈనెలలో 15 పాడయ్యాయి. ఇలా పెరుగుతూ పోతుండటంతో స్పేర్‌లో ఉన్నవి అయిపోతే ఎలా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. అసలే కరవు పరిస్థితులు వెంటాడుతున్నాయి. దీనికి తోడు బోరు బావులు అంతగా పనిచేయడం లేదు. నీటి కోసం కష్టాలు ఆరంభమయ్యాయి. తొమ్మిది గంటల పాటు కరెంటు సరఫరా జరుగుతున్నా తోడేందుకు నీరు లేకుండా పోయింది. ఉన్న నీటిని వినియోగించుకునేందుకు ఆటోమాటిక్ స్టార్టర్లు వాడుతున్నారు. ఈ కారణంగా ఎక్కువగా మోటారు, ఇటు నియంత్రికలపై భారం పడి మొరాయిస్తున్నాయి. 14రోజులుగా నియంత్రికలు ముట్టడం లేదు. దీంతో ఎప్పుడు ఎలాంటి సమస్య వస్తుందోనని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గండేడ్ మండలం మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోకి వెళ్లడంతో 24గ్రామాలకు చెందిన నియంత్రికలు పరిగికి రాకపోవడంతో కాస్త భారం తగ్గుతోంది. గతంలో నెలకు 50 వరకు మరమ్మతుకు గురైన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇలాంటి సమయంలో సకాలంలో మరమ్మతు ఆగిపోతే ఆర్థికంగా చాలా వరకు నష్టం జరిగే ప్రమాదముంది. అధికారులు ముందస్తు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని డివిజన్ రైతులు కోరుతున్నారు.


మరమ్మతు చేయాల్సిన నియంత్రిక

# చిత్రాలివి.. పరిష్కారం చూపాలి!

## తీగతో తిప్పలు


కర్రల పైనుంచి ఏర్పాటు చేసిన తీగలు

చన్‌గోముల్ (పూడూరు): చన్‌గోముల్‌లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. స్థానిక ఎస్సీ కాలనీలో ఇళ్లకు సరఫరా చేసేందుకు స్తంభాలు లేకపోవటంతో చేసింది లేక కొందరు కర్రల సహాయంతో తీగలను ఏర్పాటు చేశారు. వర్షాకాలం కావటంతో ఎర్తింగ్ సమస్య వచ్చి ప్రమాదం చోటుచేసుకునేందుకు ఆస్కారం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు పట్టించుకుని అవసరం ఉన్నచోట అదనపు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి సమస్య రాకుండా చూడాలని కోరుతున్నారు.

## దీపాలు లేక చీకట్లు

మన్నెగూడ (పూడూరు): మన్నెగూడ ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం సమీపంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అక్కడి నుంచి నిత్యం ఎంతో మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. చీకటి పడితే ప్రాంగణం సమీపంలో అంధకారం నెలకొంటుదని పేర్కొంటున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావటంతో రాత్రి సమయంలో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికయినా పట్టించుకుని తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


దీపాలు ఏర్పాటు చేయాల్సింది ఇక్కడే..

## ప్రయాణం కష్టం


రోడ్డుపై ఏర్పడిన గుంతలు ఇవే

రాకంచర్ల (పూడూర): రాకంచర్ల నుంచి పెద్ద ఉమ్మెంతాల్ వైపు వెళ్లే దారిలో రోడ్డు అధ్వానంగా మారిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ రాజ్ విభాగంలో ఉన్న ఈ రహదారిలో మూడేళ్ల కిందట అధికారులు బీటీ వేశారు. ప్రస్తుతం ఎక్కడ పడితే అక్కడ గుంతలు ఏర్పడటంతో వాహన దారులు అక్కడి నుంచి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇరు గ్రామాలకు రాకపోకలు అధికంగా ఉండటంతో రద్దీగా ఉంటుంది.

## వృథాగా నీటి ట్యాంకు

కండ్లపల్లి (పూడూరు): కండ్లపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో వాటర్ ట్యాంకు నిరుపయోగంగా మారింది. గతంలో విద్యార్థులకు ఉపయోగం కోసం పాఠశాల ఆవరణలో ట్యాంకు నిర్మాణం చేపట్టారు. గత కొంత కాలంగా వాడకంలో లేకపోవటంతో అందులోకి నీటిని నింపటం లేదు. విద్యార్థుల కోసం మరోచోట కొత్తగా ట్యాంకు నిర్మాణం చేపట్టినా పాతది వృథాగా మారిందని స్థానికులు తెలిపారు.


నిరుపయోగంగా మారిన వాటర్ ట్యాంకు

## నాణ్యమైన విద్యను అందిస్తున్నాం


దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయులు తదితరులు

కుల్కచర: సమష్టి కృషితో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామని రాంపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు పేర్కొన్నారు. మండల పరిధిలోని రాంపూర్‌లో విద్యార్థులకు ఏకరూప దుస్తులను పాఠశాల విద్యాకమిటీ అధ్యక్షులు స్థానికులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని అన్నారు. ఉచిత విద్య, దుస్తులు, పుస్తకాలు, ఉపకార వేతనాలు ఇలా అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలకు ప్రోత్సాహాన్ని ఇవ్వాలని, తద్వారా మరింత బలోపేతం అవుతాయని అన్నారు.

## బస్సు సౌకర్యాన్ని కల్పించండి

కుల్కచర్ల, న్యూస్‌టుడే: చౌడాపూర్ నుంచి మరికల్ మీదుగా మహబూబ్‌నగర్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలని చౌడాపూర్, మందిపల్ తదితర గ్రామాల విద్యార్థులు, యువత కోరుతున్నారు. సమీపంలో ఉన్న నవాబ్‌పేట మండల కేంద్రంలోని ఎన్మన్‌గండ్ల, నవాబ్‌పేట, మహబూబ్‌నగర్‌లలోని కళాశాలలకు ప్రతి నిత్యం చౌడాపూర్, వీరాపూర్, మరికల్, కొత్తపల్లి, కన్మన్‌కాల్వ, తదతర గ్రామాల నుంచి విద్యార్థులు రాకపోకలను సాగిస్తున్నారని చెప్పారు. కనీసం ఒక్క బస్సు కూడా లేకపోవడంతో ఆటోలు, ప్రైవేటు వాహనాల్లోనే వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ సమస్యను ఎదుర్కొంటున్నామని, గతంలో పరిగి డిపో నుంచి చౌడాపూర్ మీదుగా బస్సులు నడిచినా వాటిని అప్పట్లోనే రద్దు చేశారని అన్నారు. పరిగి ఆర్టీసీ అధికారులు స్పందించి చౌడాపూర్ మీదుగా మహబూబ్‌నగర్‌కు ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు సౌకర్యాన్ని కల్పించాలని చౌడాపూర్ గ్రామ విద్యార్థులు, యువకులు కోరుతున్నారు.

## కృష్ణస్వామి సేవలు చిరస్మరణీయం

పరిగి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో సామాజిక రాజకీయ ఉద్యమాలకు నాందిగీతం పలికిన చైతన్యశీలి కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 124వ జయంతి వేడుకలు సోమవారం పట్టణంలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అమరవీరుల కూడలిలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాలుకా, మండల ముదిరాజ్ సంఘం నాయకులు దోమ రాంచంద్రయ్య, కృష్ణ, ఆర్.ఆంజనేయులు, డి.మాణిక్యం, ముకుంద నాగేశ్వర్, మాణిక్యం మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడుగా, రచయితగా, జర్నలిస్టుగా, విద్యా సంస్థల స్థాపకుడిగా, విద్యావేత్తగా హైదరాబాద్ మేయర్‌గా విశేష సేవలను అందించారని తెలిపారు. సమాజంలో అట్టడుగు వర్గాల సంక్షేమానికి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అశోక్, బుచ్చన్న, రామకృష్ణ, శ్రీశైలం, వెంకటయ్య, రామాంజనేయులు, సత్తయ్య, శేఖర్ పాల్గొన్నారు.

## విజేతకు వెండి కడియం

మద్దూరు, న్యూస్‌టుడే: భూనీడ్ ఆంజనేయస్వామి ఉత్సవాల సందర్భంగా రెట్టపట్లు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో బండగొండ గ్రామానికి చెందిన దస్తప్పకు గ్రామ సర్పంచి మహిపాల్‌గౌడ్, దామగన్‌పూర్ పీఏసీఎస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డిలు వెండి కడియం అందజేశారు. ఈ కార్యక్రమంలో శివరెడ్డి, వెంకట్రామరెడ్డి, కావలి ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## విద్రోహదినం పాటించాలి

కోస్గి: నూతన పింఛన్ విధానాన్ని రద్దు చేస్తూ పాత పింఛన్ విధానాన్ని చాన్నాళ్లుగా కోరుతూ వస్తున్నామని, కేంద్ర ప్రభుత్వాలు పట్టించుకోకుండా సీపీఎస్ విధానాన్ని కొనసాగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎన్.కిష్టయ్య అన్నారు. కోస్గిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ... 2013 సెప్టెంబరులో ఈ విధానానికి చట్టబద్ధం చేయడాన్ని వ్యతిరేకిస్తూ సెప్టెంబరు 1న పింఛన్ విద్రోహదినంగా పాటిస్తున్నామని పేర్కొన్నారు. ఆ రోజు ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొనాలని, పాత విధానాన్ని పునరుద్ధరించే వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తూనే ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రఘుపాల్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, మండల అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, నాయకులు భానుప్రకాష్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

# పరిగి


చిన్నారులకు దుస్తులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

## విద్యార్థులకు దుస్తుల పంపిణీ

**బొంపల్లి(దోమ), న్యూస్‌టుడే:** స్వాతంత్ర్య దినోత్సవ సంబురాలకు దోమ మండల పరిధిలోని పలు పాఠశాలను సిద్ధం చేశారు. విద్యార్థులు గదులు శుభ్రం చేసుకున్నారు. మువ్వన్నెల జెండాకు అందమైన కాగితాలు అతికించి మంగళవారానికి సిద్ధం చేశారు. పండగ సందర్భంగా ఆలపించే జాతీయ గీతాల సాధన చేశారు. నృత్య ప్రదర్శనలకు చిన్నారులతో అభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా నూతన దుస్తులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం రామాంజనేయులు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య భారతావనిలో చిన్నారులు స్వేచ్ఛగా ఎదగాలని అన్నారు.

## హరితహారంలో కుల్కచర్లకి పురస్కారం

**కుల్కచర్ల:** హరితహారం కార్యక్రమంలో జిల్లాలో కుల్కచర్ల మండలానికి ప్రభుత్వం గుర్తింపును ఇచ్చింది. ఈ మేరకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వికారాబాద్‌లో జరిగే కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీఓ సురేష్‌బాబు, ఈజీఎస్ ఏపీఓ మల్లి కార్జున్‌లు ప్రశంసాపత్రాన్ని అందుకోనున్నారు.

## సందడిగా బోనాలు

**కుల్కచర్ల:** మక్తవెంకటాపూర్‌లో బోనాల ఉత్సవాలు జరిగాయి. ప్రతి సంవత్సరం శ్రావణ మాసం చివర్లో ఇక్కడ బోనాల ఉత్సవం జరగడం ఆనవాయితీ. సాయంత్రం అమ్మవారి దేవాలయంలో పూజలను నిర్వహించి మొక్కులను సమర్పించారు. సర్పంచి సంధ్యాఅశోక్, ఎంపీటీసీ బుడ్డమ్మ, పరిగి సీఐ నాగేశ్వర్‌రావు, మాజీ సర్పంచి రాందాస్ పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు


మందిపల్‌లో జన్మాష్టమి వేడుకలు


బృంగి పాఠశాలలో ఉట్టి కొడుతున్న చిన్నారులు


కుల్కచర్లలోని ఓ పాఠశాల ఆవరణలో..


చౌడాపూర్‌లో వేడుకలు

**పరిగి, న్యూస్‌టుడే:** పరిగి నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యాలయాల్లో చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణతో ఆకట్టుకున్నారు. పరిగి పట్టణంలోని ప్రగతి విద్యాలయం విద్యార్థులు వేషధారణతో ప్రధాన వీధుల్లో ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. బృంగి ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు ఉట్టి కొట్టడం ఆద్యంతం అలరించింది. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రకాష్, ఎం.పవన్‌కుమార్ పాల్గొన్నారు. మండలంలోని నారాయణపూర్ గ్రామంలో యువ చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు చిన్న కృష్ణుడు, గొల్లభామల వేషధారణతో చూపరులను అలరించారు.

**పరిగి:** రాఘవాపూర్, రూప్‌ఖాన్‌పేట, ఖుదావంద్‌పూర్, నస్కల్, మాదారం, చిట్యాల గ్రామాల్లో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. చిన్నారులు గోపికలు, కృష్ణుని వేషధారణతో ర్యాలీ నిర్వహించారు. షిర్డీసాయి మందిరం చిన్నికృష్ణులతో కోలాహలంగా మారింది. పలువురు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**కుల్కచర్ల:** శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గ్రామాల ప్రజలు నిర్వహించారు. కుల్కచర్ల, చౌడాపూర్ తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులు ఆకట్టుకునే వేషధారణతో అలంకరించుకొని ర్యాలీని నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీపడి ఉట్టికొట్టారు. ఉల్లాసంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉట్టిని కొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి పోటీలు పడి ఉట్టికొట్టారు.

**కుల్కచర్ల గ్రామీణ:** కృష్ణాష్టమిని గ్రామాలలో ప్రజలు ఘనంగా నిర్వహించారు. శ్రావణ సోమవారం, కృష్ణాష్టమి ఉండటంతో దేవాలయాల దగ్గర ప్రజలు పూజలు నిర్వహించారు. పాంబండ దేవాలయం దగ్గర ఉదయం నుంచే భక్తుల సందడి నెలకొంది. దేవాలయం ముందర ఉన్న తీర్థంలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. రామలింగేశ్వర స్వామికి రుద్రాభిషేకం, బిల్వార్చన ప్రత్యేక పూజలు ఆలయ అర్చకులు నిర్వహించారు. చిన్నారులను శ్రీ కృష్ణుని, గోపికల వేషధారణ అందంగా తయారు చేశారు.

**దోమ:** దోమలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతి పాఠశాల విద్యార్థులు శ్రీకృష్ణుడు గోపికల వేషధారణల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముద్దులొలికే పిల్లల్ని చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. ప్రధాన వీధుల్లో పాటలు పాడుతూ నృత్య ప్రదర్శనతో అలరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గురునాథ్‌రెడ్డి, వెంకటయ్య, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

**దాదాపూర్(దోమ):** దాదాపూర్ సన్‌షైన్ స్కూల్లో శ్రీకృష్టామి వేడుకలు నిర్వహించారు. పండగ ప్రత్యేకను చాటే పాటలు పాడారు. చిన్నారుల వేషాధారణల్లో గ్రామంలో ఊరేగించారు. నృత్యాలు చేస్తూ వేషదారణల్లో మెరిశారు. ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి ఆటపాటలను తిలకించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నారాయణగౌడ్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ సంప్రదాయలను తెలిపే ఈ వేడుకలతో చిన్నారుల్లో దేశభక్తి, దైవభక్తి కల్గుతుందన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రవికుమార్, దస్తయ్య, సునీల్, రిజ్వానా, పావని పాల్గొన్నారు. దిర్సంపల్లి, మోత్కూర్ గ్రామాల్లోనూ వేడుకలు జరిగాయి.


కుల్కచర్లలో జన్మాష్టమి వేడుకల్లో చిన్నారులు


నారాయణపూర్ గ్రామంలో..


దాదాపూర్‌లో నృత్య ప్రదర్శన


దిర్సంపల్లిలో గోపిక కృష్ణుడిగా చిన్నారులు

## పాఠశాలలో చోరీ

**చిట్యాల్, పరిగి:** చిట్యాల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు పాఠశాల తరగతి గది తాళం విరగ్గొట్టి కంప్యూటరు గదిలో ఉన్న ప్రొజెక్టర్, మన టీవీ సెట్‌టాప్ బాక్సు, శ్యాంసంగ్ స్పీకర్లు, డీవీడీ ప్లేయర్, కంప్యూటరు మానిటర్, యూపీఎస్ బ్యాటరీ ఎత్తుకెళ్లారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్ పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.



# ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు సిగ్నళ్లు

## జిల్లా పాలనాధికారిణి దివ్య



డీఎస్పీతో చర్చిస్తున్న జిల్లా పాలనాధికారిణి దివ్య


**వికారాబాద్ టౌన్, న్యూస్‌టుడే:** జిల్లా కేంద్రం వికారాబాద్‌లో ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు సిగ్నల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నట్లు జిల్లా పాలనాధికారిణి దివ్య అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నళ్లను, ఎస్పీ అన్నపూర్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పట్టణంలో ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. వాహనాలు నిలిపేందుకు ప్రత్యేకంగా పార్కింగ్ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఆమె వెంట ఆర్డీఓ విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

### కలెక్టరేట్ స్థల పరిశీలన..

జిల్లా కేంద్రం వికారాబాద్ డీటీసీ పక్కన జిల్లా కలెక్టరేట్ కార్యాలయం భవన సముదాయానికి కేటాయించిన స్థలాన్ని జిల్లా పాలనాధికారిణి దివ్య, ఎస్పీ అన్నపూర్ణలు సోమవారం పరిశీలించారు. కలెక్టరేట్ భవన నిర్మాణానికి సంబంధించిన వివిధ విషయాలను సంబంధిత శాఖ అధికారులతో చర్చించారు. ఆమె వెంట డిఎస్పీ టి.స్వామి ఉన్నారు.

# 2019 ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా ప్రణాళిక

## భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్



మాట్లాడుతున్న రమేష్

**బషీరాబాద్, న్యూస్‌టుడే:** తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల ఆత్మ క్షోభించేలా కేసీఆర్ వ్యవహరిస్తున్నారని.. ఉవ్వెత్తున జరిగిన ఉద్యమ సమయంలో ఇచ్చిన మాట ప్రకారం సెప్టెంబరు 17న ప్రభుత్వం తరపున విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీ అధికారమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందిస్తున్నామని.. అధికారంలోకి రాగానే అధికారికంగా విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. పండిత్ దీన్‌దయాళ్ విస్తారక్ యోజన కార్యక్రమంలో భాగంగా గ్రామగ్రామాల్లో పర్యటిస్తూ కార్యకర్తలు, పార్టీని బలోపేతం చేస్తున్నామన్నారు. పంచాయతీల బలోపేతానికి 14వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం విడుదల చేస్తోందని.. రాష్ట్రం పంచాయతీలకు నిధులు విడుదల చేయడం లేదన్నారు. భాజపా అవినీతి రహిత పార్టీ అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులను అణిచి వేస్తుందని.. వారికి ప్రభుత్వంలో ఎలాంటి పదవులు ఇవ్వలేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 22న బషీరాబాద్‌లో పెద్దఎత్తున నిరసన, ధర్నా కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అన్ని మండల కేంద్రాల్లో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, విద్యుత్తు సమస్యలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సౌకర్యాలు, నిరంతర వైద్యం అందించాలని కోరుతూ నిరసన చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు రాజ్‌కుమార్ కులకర్ణి, మండల పార్టీ ఇన్‌ఛార్జి బస్వరాజ్, బీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు బొప్పి సురేష్, శివకుమార్, కార్యవర్గ సభ్యులు గంగాధర్ ఉన్నారు.

# డిస్కస్‌త్రోలో యాలాల విద్యార్థికి బంగారు పతకం



సాధించిన పతకంతో రాజు

**తాండూరు:** రాష్ట్ర స్థాయిలో 16 ఏళ్ల విభాగంలో నిర్వహించిన డిస్కస్‌త్రో పోటీల్లో యాలాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రాజు బంగారు పతకం సాధించాడు. ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు. రాజు డిస్కస్‌ను అందరి కంటే ఎక్కువ దూరం విసరడంతో మొదటి స్థానంలో నిలిచారు. దీంతో పోటీల నిర్వాహకులు బంగారు పతకంతో పాటు ప్రశంసాపత్రం అందచేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ బి.నర్సింలు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

# ఓసీ ఉద్యోగుల జాతీయ సదస్సు 20న

**గన్‌ఫౌండ్రి:** ఓసీ ఉద్యోగుల జాతీయ సదస్సును ఈ నెల 20న జైపూర్‌లో నిర్వహించనున్నట్లు ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జి.కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పదోన్నతుల్లో రిజర్వేషన్లను సమీక్షించాలని సుప్రీంకోర్టుతోపాటు పలు రాష్ట్రాల న్యాయస్థానాలు ఇటీవల అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో ఓసీ ఉద్యోగుల సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి అనేక రాష్ట్రాల ఓసీ ఉద్యోగ ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. గత 15 ఏళ్ల నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేస్తుండటంతో పదవీ విరమణ సమీపిస్తున్నప్పటికీ ఓసీ, బీసీ ఉద్యోగులు రెండో పదోన్నతి కూడా లభించక తీవ్ర మానసిక క్షోభకు గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్‌తోపాటు ఇటీవల కర్ణాటక రాష్ట్ర న్యాయస్థానం సైతం పదోన్నతుల్లో రిజర్వేషన్లు రద్దు చేయాలని స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ రాజకీయ నాయకులు, పార్టీలు రాజ్యాంగ సవరణకు ప్రయత్నించడం సిగ్గు చేటన్నారు.

# జిల్లాస్థాయి అవార్డులకు 123 మంది ఎంపిక

**వికారాబాద్ టౌన్:** జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తించి, ఉత్తమ సేవలు అందించిన అధికారులను జిల్లా స్థాయి ఉత్తమ అవార్డులకు ఎంపిక చేశారు. ఆగస్టు 15న జిల్లా కేంద్రం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర రవాణాశాఖా మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా వీరికి ప్రశంసాపత్రాలు అందచేయనున్నారు. వందశాతం మరుగు దొడ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న గ్రామాల సర్పంచులను సత్కరించనున్నారు.

# కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడి నియామకం



ఉత్తమ్‌చంద్‌ను అభినందిస్తున్న నేతలు

**తాండూరు, న్యూస్‌టుడే:** కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా తాండూరు మండలం జిన్‌గుర్తి గ్రామానికి చెందిన పి.ఉత్తమ్‌చంద్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు మాజీ మంత్రి జె.చిత్తరంజన్ దాస్ తాండూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఎం.రమేష్ సమక్షంలో సోమవారం ఉత్తమ్‌చంద్‌కు నియామక పత్రం అందజేశారు. జిల్లాలో వెనుక బడిన తరగతులు ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ పార్టీ తరపున పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ డైరెక్టర్ ధారాసింగ్, తాండూరు వ్యవసాయ విపణి మాజీ ఉపాధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నయీం తదితరులు పాల్గొన్నారు.

## 450 మంది... రూ.3.37 కోట్లు

(మొదటిపేజీ తరువాయి) వెళ్లే అవకాశముంది. ఇవీ వివరాలు...

జిల్లాలో పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ పేద యువతులకు కల్యాణలక్ష్మి పేరిట, ముస్లింలలోని పేద యువతులకు షాదీముబారక్ పేరిట ప్రభుత్వం వివాహాలకు ఆర్థిక సహాయం అందజేస్తోంది. పథకం ఆరంభం నుంచి మార్చి 31వ తేదీ వరకు రూ.51 వేల చొప్పున చెల్లించగా.. ఏప్రిల్ ఒకటి నుంచి ఈ మొత్తాన్ని రూ.75,116 పెంచారు. దీంతో ఇటీవల వివాహం చేసుకున్న యువతులు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయాన్ని పొందేందుకు ఉత్సాహంగా దరఖాస్తులు సమర్పించారు. మార్చి 31వ తేదీకి ముందు దరఖాస్తు చేసుకున్న 604 మంది లబ్ధిదారులకు రెండు నెలల క్రితం మంత్రి పి.మహేందర్‌రెడ్డి చేతులమీదుగా వధువుల పేరిట వికారాబాద్‌లో చెక్కుల పంపిణీని పూర్తి చేశారు. ప్రభుత్వం పేద యువతుల వివాహ ఖర్చులకు అందజేస్తున్న ఆర్థిక సాయాన్ని వధువు పేరిట అందిస్తోంది. ఆర్థిక సాయం అందించే సమయానికి వివాహం పూర్తవుతుండగా... వధువు అత్తగారింటికి వెళ్తోంది. ఈ సమయంలో ప్రభుత్వం అందించే చెక్కును మెట్టినింటివారు పొందుతుండటంతో వధువు తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా దక్కడం లేదు. వరుడికి కట్నకానుకలు సమర్పించేందుకు, ఘనంగా వివాహం చేసేందుకు వధువు తల్లిదండ్రులకు రూ.లక్షల్లో ఖర్చవుతోంది. ఈ భారాన్ని కొంత వరకు భరించే లక్ష్యంతో ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పేరిట ఆర్థిక సాయం అందిస్తుండగా... వధువు తల్లిదండ్రులకు చేరడంలేదు. అత్తగారింటి వారు ఈ సాయాన్ని తీసుకుంటుండగా.. ఇంకొందరు సగం మాత్రమే చెల్లిస్తున్నారు. మరికొందరు వరుడి ద్విచక్ర వాహన కొనుగోలుకు, ఇతర ఖర్చులకు వాడుతున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

**చెక్కుల రూపంలో సాయం:** పేద యువతుల వివాహాలు తల్లిదండ్రులకు భారం కాకుండా చేసేందుకు అందిస్తున్న ఆర్థిక సాయం పక్కాగా వధువు కుటుంబానికే దక్కేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఆర్థిక సాయాన్ని వధువు తల్లి పేరిట చెక్కుల రూపంలో అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రకటించారు.

**తాండూరులో నిలిచిన చెల్లింపులు:** జిల్లా మొత్తంగా చూస్తే తాండూరు నియోజకవర్గంలోని అత్యధిక కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తుదారులకు చెల్లింపులు నిలిచిపోయాయి. యువతులు వారి వయస్సు ధ్రువపత్రాలను సమర్పించకపోవడమే కారణం. వీరంతా చదువుకోకపోవడంతో వయస్సు ధ్రువపత్రాలను దరఖాస్తులకు జత చేయలేకపోయారు. ఇలాంటి వారు ఒక్క తాండూరు మండల, పట్టణంలోనే 96 మంది ఉండగా నియోజకవర్గంలోని యాలాల, బషీరాబాద్, పెద్దేముల్ మండలాల్లో అరవై మంది వరకు ఉన్నట్లు అధికారులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా విద్యార్హత లేక వయస్సు ధ్రువీకరణ పత్రాలు సమర్పించని వారి సంఖ్య 400 వరకు ఉంటుందని అంచనా. వీరంతా మూడు రోజుల్లోగా వయస్సు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని అధికారులు గడువు విధించారు. లేదంటే ఆర్థికసాయం నిధులు వెనక్కి వెళ్లే అవకాశాలు ఉన్నట్లు స్పష్టం చేశారు. ఒకసారి ఆర్థికసాయం సొమ్ము వెనక్కి వెళ్లిందంటే తిరిగి మంజూరు కావడం సాధ్యపడదని స్పష్టం చేస్తున్నారు. వధువు వయస్సు ధ్రువపత్రాలను జిల్లా ఆస్పత్రిలోని సివిల్ సర్జన్ అనురాధను సంప్రదించి తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. తాండూరు మండల, పట్టణంలో కల్యాణలక్ష్మికి సంబంధించి 265 మందికి రూ.1.99 కోట్లు చెల్లించాల్సి ఉండగా, షాదీముబారక్‌కు సంబంధించి 185 మందికి రూ.1.38 కోట్ల ఆర్థికసాయాన్ని అందజేయాల్సి ఉంది.

# మేడికొండకు.. మేడిపండు హామీలు..!

**ఉపాధ్యాయురాలి మృతితో భవిత తారుమారు ☛ అసౌకర్యాల మధ్యే చదువులు, తగ్గుతున్న విద్యార్థులు**

**పూడూరు, న్యూస్‌టుడే:** పూడూరు మండలం మేడికొండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చౌదరి ప్రభావతి విద్యుత్తు ప్రమాదంలో దుర్మరణం చెంది ఏడాది పూర్తయింది. గతేడాది ఆగస్టు 14న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పాఠశాల ఎదుట జెండా ఆవిష్కరణకు ఇనుప రాడ్ ఏర్పాటు చేసే క్రమంలో పైనున్న హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురైన చిన్నారులను రక్షించే ప్రయత్నంలో ప్రభావతి అక్కడిక్కడే మృతి చెందారు. అప్పట్లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరితో పాటు పలువురు నాయకులు పాఠశాలను సందర్శించారు. హామీల వర్షం కురిపించారు. ఏడాది పూర్తయినా ఒక్క అడుగు ముందుకు పడలేదు.



మేడికొండ పాఠశాల



అంగన్‌వాడీ చిన్నారులతో కలిసి భోజనం చేస్తున్న విద్యార్థులు

### తగ్గుతున్న విద్యార్థులు

ఏడాది క్రితం ప్రధానోపాధ్యాయురాలు మృతి చెందడంతో విద్యాశాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఇక్కడి సమస్యలపై ఆరా తీశారు. పాఠశాలకు రెండు అదనపు తరగతి గదులు వెంటనే నిర్మాణం చేపట్టడంతో పాటు ప్రహరీ, శౌచాలయాలను నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజురు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇంత వరకు ఈ హామీలు నెరవేరలేదు. ఉన్న తరగతి గది శిథిలావస్థకు చేరుకుంది. పూర్తిస్థాయి ఉపాధ్యాయులను నియమించలేదు. దీంతో గ్రామస్థులు తమ చిన్నారులకు ప్రైవేటు పాఠశాలకు పంపుతున్నారు. ప్రస్తుతం 20 మంది విద్యార్థులకు ఒక విద్యా బోధకుడితోనే తరగతులు చెప్పిస్తున్నారు.

### మార్పుకు పడని అడుగు

మేడికొండ పాఠశాలలో నెలకొన్న సమస్యలపై 'మేడిపండులా...మేడికొండ బడి' శీర్షికన గత ఏడాది ఆగస్టు 16న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అప్పటి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి అధికారులు గ్రామానికి వచ్చారు. జిల్లా సంయుక్త పాలనాధికారి ఆమ్రపాలితో పాటు ఆర్జేడీ కృష్ణారావు డీఈవో రమేశ్ డిప్యూటీ డీఈవో హరిశ్చందర్ నాయక్ చేవెళ్ల, ఆర్డీవో చంద్రమోహన్ పాఠశాలలో తిరిగి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదులు నిర్మాణం చేపట్టేందుకు స్థలం లేకపోవటంతో మరోచోట నిర్మాణం చేసేందుకు యోచించారు. గ్రామం నుంచి పూడూరుకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ప్రభుత్వానికి చెందిన ఐదెకరాల ప్రభుత్వ భూమి ఖాళీగా ఉందని స్థానికులు అధికారులకు తెలపటంతో వెంటనే స్థలాన్ని పరిశీలించారు. అన్ని విధాలుగా అనువైందని గుర్తించారు. ఇప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

### అందని పరిహారం

అప్పటి ప్రధానోపాధ్యాయులురాలు ప్రభావతి మృతితో ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆమెకు ఇద్దరు కూతుళ్లు కావటంతో వారి చదువులకు భరోసా కల్పిసామని చెప్పారు. భర్త రాజీవ్‌రెడ్డికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు చిన్నారుల చదువులకు అయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. తర్వాత భర్త రాజీవ్‌రెడ్డికి మాత్రం ప్రభుత్వ పాఠశాలలో జూనియర్ సహాయక హోదాతో ఉద్యోగాన్ని ఇచ్చారు. మిగిలిన హామీలు విస్మరించారు.

#### ఇక్కడే చదివించాలని ఉంది

– గోపాల్, రైతు మేడికొండ

మా పిల్లలను స్థానిక పాఠశాలలోనే చదివించాలని ఉంది. అయితే పాఠశాలలో ఉపాధ్యాయుడు లేరు. విద్యావలంటీరుతో నడిపిస్తున్నారు. బడి ఆవరణలో మొత్తం పిచ్చిమొక్కలు. దీంతో భారం అయినా తప్పని పరిస్థితిలో ప్రైవేటు పాఠశాలకు పంపిస్తున్నాం.

#### సౌకర్యాలు లేక అవస్థలు

– విష్ణువర్ధన్‌రెడ్డి, తెరాస గ్రామకమిటీ అధ్యక్షులు

స్థానికంగా పాఠశాలలో సౌకర్యాలు లేకపోవటంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఇక్కడ పొదలు, దోమలు, చుట్టూ పొలాలు ఉండటంతో విష కీటకాలు వస్తున్నాయి. కలుషిత నీరు పిల్లలు తాగాల్సి వస్తోంది. గతంలో అధికారులు ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేర్చలేదు.

#### పరిహారం అందాల్సి ఉంది

– అమర్‌నాథ్. పీఆర్టీయూ మండల అధ్యక్షులు

విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే ఉపాధ్యాయురాలు దుర్మరణం చెందిన సంఘటన జరిగి ఏడాది అవుతున్నా విషాదాన్ని మర్చిపోలేకపోతున్నాం. ఆమె ఇద్దరు పిల్లల భవిష్యత్తు ఇబ్బందిగా మారింది. రూ. 10 లక్షల వరకు ఎక్స్‌గ్రేషియా అందించి కుటుంబాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

# ఆర్థిక ప్రగతి... సామాజిక అభివృద్ధి!

(మొదటిపేజీ తరువాయి) మూడో దశ నడుస్తోంది. మొదటి దశలో 249 చెరువులకు రూ.85 కోట్లు కేటాయించారు. రెండో విడతలో 271 చెరువులకు రూ.75 కోట్లు కేటాయించగా, మూడో దశలో 129 చెరువులకు రూ.29 కోట్లు వెచ్చించారు. అయితే బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యం జరుగుతుండటంతో పనులు నిర్దేశిత సమయంలో జరగడం లేదు. నాణ్యతా ప్రమాణాలకు నోచుకోవడం లేదన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరితే జిల్లాలో మున్ముందు దశాబ్దాల పాటు సాగు నీటికి ఢోకా ఉండదు. ఫలితంగా భూగర్భ జలాలు పెరిగి తాగు నీటి ఇబ్బందులు తీరనున్నాయి.

### వృద్ధికి రహదారులే చిహ్నాలు

ప్రభుత్వం జిల్లాలోని రహదారుల మరమ్మతులు, నిర్మాణానికి రూ.వేయి కోట్లు కేటాయించినా పనుల తీరుపై అధికారుల పర్యవేక్షణ లోపం కనిపిస్తోంది. నిర్దేశిత సమయంలో పనులు పూర్తి కావడం లేదు. ప్రతిపాదనలు తిరిగి పంపడంతో భారం తడిపి మోపెడవుతోంది. ఫలితంగా ప్రజా ధనం వృథా అవుతోంది. జిల్లాలో ప్రధానంగా రహదారులు, భవనాలు, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలోని రహదారులు దారుణంగా ఉన్నాయి. ఇప్పుడిప్పుడే వికారాబాద్-తాండూరు, మన్నెగూడ-సదాశివపేట, హైదరాబాద్-బీజాపూర్, మహబూబ్‌నగర్-చించోలి రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం చొరవ తీసుకుంటోంది. ప్రస్తుతం సుమారు రూ.380 కోట్ల విలువైన రహదారి అభివృద్ధి పనులు నడుస్తున్నాయి. ఇక భవిష్యత్తులో ప్రజల ప్రయాణ సమస్యలు అధిగమించే తరుణం రానుందని ఆశగా ఎదురు చూస్తున్నారు.

### విద్యా వ్యవస్థ మెరుగుపడితే బాగు

విద్యాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాయి. అందులో భాగంగానే ఉచిత భోజనం, ఏకరూప దుస్తులు, ఉపకార వేతనాలు, పాఠ్యపుస్తకాల పంపిణీ, మౌలిక వసతుల కల్పన, డిజిటల్ తరగతుల ఏర్పాటు తదతర కార్యక్రమాలు చేపడుతున్నారు. అయినా జిల్లాలో అక్షరాస్యతా శాతం 58 శాతం కంటే మించి పెరగడంలేదు. జిల్లాలో 1,073 పాఠశాలలు ఉన్నాయి. సుమారు లక్ష మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల అవసరాలకు తగినట్లుగా విశాల తరగతి గదుల నిర్మాణం, నూతన హంగులతో కూడిన విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో ఇంకా పెరగాల్సినంత నమ్మకం పెరగడం లేదు. కొందరు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు మేం నిజాయితీగా పనిచేస్తున్నాం. ఉన్నత విద్యా బోధనకు కట్టుబడి ఉన్నామని ప్రజలకు సందేశమివ్వడానికి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి ఆదర్శంగా నిలుస్తున్నారు.

### జోరందుకున్న వైద్యం

జ్వరం వస్తే మంచాన పట్టి మృత్యువుతో పోరాడటం తప్ప మేరే మార్గం లేని రోజుల నుంచి ప్రస్తుతం ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. జిల్లాలో 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా, ఏరియా ఆసుపత్రుల నుంచి వైద్యవ అందిస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో పేదలకు కార్పొరేట్ వైద్యం చేరువైంది. ఇటీవల ప్రభుత్వం ఆసుపత్రి ప్రసవాలకు ప్రోత్సాహకాలు ప్రకటించిన నేపథ్యంలో వైద్యులకు చేతినిండా పని లభిస్తోంది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. వ్యాది నిరోధక టీకాలు, అంగన్వాడీ కేంద్రాల నుంచి గర్భినిలు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. జిల్లాలో మొత్తం 1,107 అంగన్వాడీ కేంద్రాల నుంచి సుమారుగా 60 వేల మదికిపైగా లబ్ధిపొందుతున్నారు.

### అందరికీ ఉపాధి

పని చేయడానికి సిద్ధంగా ఉన్న ప్రతి ఒక్కరికీ అవకాశాలు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. ఏటా కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తోంది. ఈ పథకం ద్వారా ప్రస్తుతం వికారాబాద్ జిల్లాలో మొత్తం 3,36,903 మందికి పనులు కల్పిస్తున్నారు. దినసరి వేతనం సుమారుగా రూ.190కిపైగా అందిస్తున్నారు. ఫలితంగా గతంతో పోల్చుకుంటే ప్రజల వలసలు తగ్గాయి. కుటుంబ జీవన వ్యవస్థలో మార్పులు వచ్చాయి. ఆర్థిక, ఆహార ఇబ్బందులను అధిగమిస్తున్నారు. దీనికితోడు ఉపాధి హామీ పథకంలో మరో 74 కార్యక్రమాలు అమలు చేస్తున్నారు.

### మహిళా భాగస్వామ్యమూ ముఖ్యమే...

ప్రస్తుతం వికారాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలు 27 శాతం మాత్రమే ఉన్నారు. వైద్య రంగంలో 40, వ్యవసాయశాఖలో దాదాపు 43 శాతం మంది మహిళలు పనిచేస్తున్నారు. అభివృద్ధిలో వీరి భాగస్వామ్యాన్ని మరింతగా పెంచాల్సి ఉంది. జిల్లాలో మహిళా సమాఖ్య సంఘాల్లో 1.90 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరు పొదుపు పాటిస్తూ బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుంటున్నారు. కానీ చాలా వరకు తీసుకున్న రుణాలను కుటుంబ అవసరాల కోసమే వాడుకుంటున్నారు. అలా కాకుండా వారు ఈ డబ్బులను ఆర్థికంగా పరిపుష్టం అయ్యేందుకు ఉపయోగించుకునేలా చూస్తే మేలు. కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా వారిని ప్రోత్సహించాలి. స్థానిక వనరులను దృష్టిలో ఉంచుకొని ఆయా ప్రాంతాల్లో ఉత్పత్తులు పెరిగేలా చేస్తే మహిళలకు ఉపాధి దొరకడంతోపాటు వారూ ఆర్థికంగా స్థిరపడతారు. జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలు గత మూడేళ్ల నుంచి అందడం లేదు. వీటినీ త్వరితగతిన అందిస్తే ఆమేరకు వారికి ప్రయోజనం దక్కుతుంది. రానున్న అయిదేళ్లలో ప్రధానమైన ఈ రంగాల్లో ప్రజలు పురోభివృద్ధి సాధిస్తే జిల్లా తద్వారా రాష్ట్రం ఆపై దేశం ప్రగతి బాట పట్టడం ఖాయం.



# స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

**కొత్త జిల్లాలో తొలిసారిగా నిర్వహణ**

**వికారాబాద్, వికారాబాద్ పట్టణం, న్యూస్‌టుడే:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానం ముస్తాబైంది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన స్టాళ్లను రూపొందించడంలో తలమునకలయ్యారు. జిల్లా సంయుక్త పాలనాధికారి సురేష్‌పొద్దార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. జిల్లా ఏర్పాటు అనంతరం తొలిసారిగా నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్న లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర రవాణాశాఖామంత్రి పి.మహేందర్‌రెడ్డి వేడుకలకు హాజరు కానున్నారు. పోలీసులు కవాతు నిర్వహించిన అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు గౌరవ వందనం స్వీకరించనున్నారు. వేదకపై నుంచి వక్తల సందేశం విని పించడానికి వీలుగా లౌడ్ స్పీకర్లను ఏర్పాటు చేశారు. వేడుకలను తిలకించడానికి హాజరయ్యే ఆహుతులు కూర్చోవడానికి ఏర్పాట్లు చేశారు. పోలీసు కార్యాలయం ఎదుట వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడానికి వేగ నియంత్రికలను ఏర్పాటు చేశారు. గుంతలుగా మారిన వేదిక పరిసరాలను మట్టితో పూడ్చి రోడ్డు రోలర్‌తో చదును చేస్తున్నారు. పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులు వేడుకల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ముందస్తు ప్రదర్శన(రిహార్సల్) చేశారు. మైదానంలో ఒకటో స్టాల్‌లో డీఆర్‌డీఏ, రెండో స్టాల్‌లో మిషన్ భగీరథ, మూడో స్టాల్‌లో మిషన్ కాకతీయ, నాల్గో స్టాల్‌లో ఉద్యానవనశాఖ, ఐదో స్టాల్‌లో అటవీశాఖ, ఆరో స్టాల్‌లో స్త్రీ, శిశు సంక్షేమశాఖ, ఏడో స్టాల్‌లో వైద్య, ఆరోగ్యశాఖ, ఎనిమిదో స్టాల్‌లో వ్యవసాయశాఖ అధికారులు తమ శాఖలకు సంబంధించి చేపట్టిన పూర్తి సమాచారాన్ని రూపొందించడంలో నిమగ్నమయ్యారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో వాటర్‌షెడ్ నమూనా, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, తదితర శాఖలు చేపట్టిన పనులు, ఇతర వివరాలను స్టాళ్లలో ఏర్పాటు చేశారు. సమర్థవంతంగా విధులు నిర్వహించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, రివార్డులు అందించనున్నారు.



సిద్ధమవుతున్న వేదిక



మిషన్ భగీరథ పనుల వివరాలను తెలిపే స్టాల్



బారికేడ్ల ఏర్పాటు..



గుంతలను మట్టితో చదును చేస్తూ..

### కార్యక్రమాలు ఇలా..

**ఉదయం 8.55:** జిల్లా పాలనాధికారిణి దివ్య, ఎస్పీ అన్నపూర్ణలు పరేడ్ గ్రౌండ్‌కు చేరుకుంటారు. **8.58:** రాష్ట్ర రవాణాశాఖా మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి వస్తారు.

**9.00:** జాతీయ జెండావిష్కరణ

**9.05:** పోలీసు గౌరవ వందనం స్వీకరణ

**9.15:** మంత్రి మహేందర్‌రెడ్డి ప్రసంగం

**9.35:** ప్రభుత్వం అభివృద్ధి పథకాలను తెలుపుతూ శకటాల ప్రదర్శన

**9.45:** సాంస్కృతిక కార్యక్రమాలు

**10.15:** జిల్లా ఉత్తమ సేవా అవార్డుల ప్రధానం

**11.00:** వివిధ శాఖల స్టాళ్ల సందర్శన, పరికరాల పంపిణీ.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జేసీ సురేష్‌పొద్దార్

# మంచుకొండల్లో.. మనోళ్లు

- సైనికులుగా సేవలు అందిస్తున్న జిల్లా వాసులు
- జమ్ము, చైనా సరిహద్దుల్లో విధులు
- నిరంతర అప్రమత్తతే దేశానికి రక్ష అంటున్న జవాన్లు



దేశ రక్షణలో సైనికుల పాత్ర కీలకం. ఎముకలు కొరికే చలిలో.. తమ ప్రాణాలు లెక్కచేయకుండా శత్రుదేశాల కుట్రలను తిప్పి కొట్టడంలో వారి కృషి ఎనలేనిది. వికారాబాద్ జిల్లా నుంచి పలువురు యువకులు దేశ సరిహద్దుల్లో సేవలు అందిస్తున్నారు. మువ్వన్నెల జెండా స్వేచ్ఛగా ఎగరాలని కోరుకుంటున్నారు. దాయాది దేశాల కుట్రలను సమర్థంగా తిప్పకొడుతూ భారత కీర్తి పతాకాన్ని ఎగురవేస్తున్నారు. ప్రధానంగా జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గం హస్నాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని గండేడ్ మండలం మహ్మదాబాద్‌ల నుంచి సమారు 200 మందికి పైగా యువకులు సైన్యంలో పనిచేస్తూ సేవలు అందిస్తున్నారు. వారిలో కొందరు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'న్యూస్‌టుడే'తో తాము విధులు నిర్వహిస్తున్న ప్రాంతం నుంచి ఫోన్‌లో మాట్లాడి.. వివరాలు వెల్లడించారు. ఆ వివరాలు ఇలా..

– న్యూస్‌టుడే, దోమ

## చైనా సరిహద్దుల్లో నిరంతర గస్తీ : వెంకటయ్య



**దో**మకు చెందిన ఆకుల నర్సమ్మ అంజిలయ్యల పెద్ద కుమారుడు వెంకటయ్య. డిగ్రీ పూర్తిచేసిన ఈయన దేశ రక్షణకు కంకణం కట్టుకున్నారు 2012లో వెలువడిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ప్రకటన చూసి దరఖాస్తు చేసుకున్నారు. దేహదారుఢ్య పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి సైన్యం చేరారు. మొదట్లో గుజరాత్‌లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం చైనా సరిహద్దులోని లద్దాక్‌లో పనిచేస్తున్నారు. డొక్లాం విషయంలో చైనా-భారత్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ దేశ రక్షణకు 24 గంటలు గస్తీ నిర్వహిస్తూ ఉంటామని తెలిపారు. ఒక్కోసారి అమ్మానాన్న, తోబుట్టువులు గుర్తుకువస్తారని, కొద్దిసేపటికే మళ్లీ విధుల్లో మునిగిపోతామని పేర్కొన్నారు. ఎప్పుడు ఎక్కడ నుంచి ఏ ఉపద్రవం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంటుందని, అయినా దేశం కోసం ఎన్ని ఇబ్బందులైనా ఎదుర్కొంటామన్నారు. 70వ స్వాతంత్ర్య దినోత్సవ వేడులకు ఘనంగా నిర్వహించుకుంటామని తెలిపారు.

## తొమ్మిదేళ్లు జమ్మూ సరిహద్దుల్లో..: చక్రవర్తి గౌడ్



**నే**ను ఉమ్మడి రంగారెడ్డి జిల్లా గండేడ్ మండలం మహ్మదాబాద్‌కు చెందిన చక్రవర్తిగౌడ్. 2000 బ్యాచ్‌కు చెందిన జవాన్ని. 17 ఏళ్లుగా దేశ సరిహద్దులో విధులు నిర్వహిస్తున్నా. అంతకు ముందు జమ్మూ కశ్మీర్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్‌లో విధులు నిర్వహించా. మొదట్లో శిక్షణ పూర్తిగానే జమ్ము సరిహద్దుల్లో విధులు కేటాయించారు. కొత్తలో సాధారణమే అనుకున్నా. కానీ పరిస్థితులు ప్రత్యేక్షంగా చూస్తే 24 గంటటూ తుపాకుల చప్పుళ్లు. నడిచేందుకు వీలుకాని పర్వతాలు, మంచు ప్రదేశం, మధ్య పనిచేయాలని తెలిసింది. గుండెనిబ్బరంతో పాటు కఠోర సాధనతో విధులకు సమాయత్తమయ్యా. జమ్ములో ఏకంగా తొమ్మిదేళ్ల పాటు బాధ్యతలు నిర్వహించా. ప్రస్తుతం ఉత్తర ప్రదేశ్‌లో పనిచేస్తున్నా ఉగ్రముప్పును ఎదుర్కోడానికి నిర్వహించే అపరేషన్ సందర్భంగా అక్కడ కొత్త ప్రదేశాల్లో పనిచేస్తున్నా. భాషా పరమైన సమస్యలు ఎదురవుతున్నాయి. కొందరు స్థానికులు సహకరించరు. ఉగ్రవాదుల సమాచారం తెలిసి వారిని ఏరివేసే క్రమంలో స్థానికుల ఇళ్లన్నింటినీ ఖాళీచేయించాల్సి ఉంటుంది. ఇలాంటప్పుడు అందరూ బయటకు వస్తారు. తుపాకులు గుడిసెల్లో, ఇతర ప్రదేశాల్లో దాచి ఉంచుతారు. మా అపరేషన్ పూర్తవగానే మళ్లీ తుపాకులు తీస్తారు. దీంతో రెండోసారి ఆపరేషన్ తప్పదు. ఇలా విధి నిర్వహణ ఒక్కోసారి నిద్ర ఉండదు. సమయానికి తినలేం. ఎన్ని కష్టాలు ఎదురైనా జాతీయ జెండా ఎల్లవేళలా రెపరెపలాడాలి. అదే మా లక్ష్యం. ధ్యేయం

## సైగలు.. సంకేతాలే కీలకం..: శ్రీనివాస్. హకీంపెట



**మా**ది కొడంగల్ డివిజన్‌లోని హకీంపేట. 2010 బ్యాచ్ సైనికుడిని. పంజాబ్‌లోని పఠాన్ కోట్ లద్దాక్‌లో విధులు నిర్వహించా. విధి నిర్వహణలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు. మంచు, గుట్టలతో నిండిన ప్రాంతంలో మామూలుగా నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడాలి. ఏమాత్రం తొందర పాటు పనికి రాదు. పొగమంచులో ఎదుటి వ్యక్తి ఎవరనేది స్పష్టంగా గుర్తించలేం. ప్రత్యర్థుల విషయంలో చాలా అప్రమత్తంగా ఉంటాం. సైనిక సైగలతో మనవారా? శత్రువులా అనేది తెలుసుకుంటాం. ఈ విషయంలో ఎలాంటి తప్ప జరిగినా ప్రమాదమే. ప్రస్తుతం సికింద్రాబాద్‌లో ఆర్మీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నా.

## మైనస్ 50 డిగ్రీల ఉష్ణోగ్రత తట్టుకోవడమే క్లిష్టం

– కొత్తపల్లి శ్రీనివాస్, కొత్తపల్లి



మాది కుల్కచర్ల మండలం కొత్తపల్లి. 2002 బ్యాచ్ జవాన్‌ని. జమ్ము, నాసిక్, పశ్చిబంగ, గలేసియార్, ఉత్తరఖండ్‌లో పని చేశా. ప్రస్తుతం అసోంలో విధులు నిర్వహిస్తున్నా. జమ్ములో మైనస్ 50 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది. చలిని తట్టుకోవడం చాలా కష్టం. 1982-83లో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఎంతో మంది మన సైనికులను దాయాది దేశం పొట్టనపెట్టుకుంది. అప్పటి నుంచి మంచు కొండలపై భారత సైన్యం సరిహద్దు కాపాలా ఉంచుతోంది. నేనూ మూడు నెలల పాటు అక్కడ విధులు నిర్వహించా. తాగేనీరు సైతం గడ్డకడుతుంది. నీటిని వేడిచేసి కరిగించి తాగాలి. మన శరీరంలో చాలా మార్పులు కలుగుతాయి. జ్ఞాపక శక్తి తగ్గుతుంది. మరోవైపు ఉగ్రముప్పు ఎటు నుంచి వస్తుందో తెలియదు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటాం. మదినిండా జాతీయ భావంతో సేవలు అందిస్తుంటాం.

# అభివృద్ధి.. సంక్షేమమే లక్ష్యం

**జిల్లా ప్రజాప్రతినిధుల మనోగతం**

**వికారాబాద్, న్యూస్‌టుడే:** నూతన జిల్లా కేంద్రం వికారాబాద్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. కొత్త జిల్లా ఏర్పాటుతో పాలన ప్రజల ముంగిట్లోకి వచ్చింది. జిల్లా ఏర్పాటుకు ముందు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే సుదీర్ఘ ప్రయాణం, రోజంతా వృథా. ఇప్పుడు కేవలం గంట వ్యవధిలోనే ఎక్కడి నుంచైనా జిల్లా కేంద్రానికి చేరుకోవచ్చు. జిల్లా వాసుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, యువతకు ఉపాధి, మహిళా సంక్షేమం దిశగా ఇప్పుడిపుడే అడుగులు పడుతున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం వేళ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు అభివృద్ధి.. సంక్షేమమే తమ అభిమతమని పేర్కొంటున్నారు.

## ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయం

– మహేందర్‌రెడ్డి, రాష్ట్ర రవాణాశాఖామంత్రి



ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అన్ని రంగాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ప్రధానంగా రహదారులకు మహర్దశ వచ్చింది. వికారాబాద్- తాండూర్ రహదారి విస్తరణ పనులు రూ.50 కోట్లతో కొనసాగుతున్నాయి. మన్నెగూడ- బీజాపూర్ జాతీయ రహదారి పనులు రూ.350 కోట్లతో చేపట్టాం. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 1300 చెరువులను మూడు విడతల మిషన్ కాకతీయ పథకం కింద పునరుద్ధరణ చేపట్టాం. పరిగి, తాండూరు, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల అభివృద్ధికి అధిక నిధులు మంజూరీ చేస్తున్నాం. మిషన్ భగీరథ కింద నిర్ణీత గడువులోగా ఇంటింటికీ తాగునీరు అందించే పనులు కొనసాగుతున్నాయి. వికారాబాద్- నస్కల్ మార్గంలో జిల్లా పాలనాధికారి కార్యాలయం నిర్మించడానికి స్థల సేకరణ పూర్తయింది. త్వరలో కార్యాలయ నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా రానున్న రోజుల్లో ఊహించని రీతిలో సంక్షేమ పథకాల అమలుకు రూపకల్పన జరుగుతుంది.

## అన్ని వర్గాలకు లబ్ధి

– సంజీవరావు, ఎమ్మెల్యే, వికారాబాద్



జిల్లా ఏర్పాటు కల సాకారమైన తర్వాత తొలిసారి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించుకోవడం మర్చిపోలేని మధురానుభూతిగా నిలిచిపోనుంది. తెరాస ప్రభుత్వ పాలనలో శరవేగంగా అభివృద్ధి జరుగుతోంది. అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతోంది. వికారాబాద్ నియోజకవర్గంలో రూ.150 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. మూడేళ్ల పాలనలో మునుపెన్నడూ జరగనంత అభివృద్ధి పనులు జరిగాయి. అన్ని గ్రామాల్లో అంతర్గత రహదారులు, మురుగుకాల్వలు నిర్మించి మౌలిక వసతులను కల్పించాం. నియోజకవర్గంలో 123 చెరువులను మిషన్‌కాకతీయ కింద పునరుద్ధరించి 6 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాం. మిషన్ భగీరథ కింద డిసెంబరు నెలాఖరు కల్లా రూ.350 కోట్లతో ఇంటింటికీ తాగునీరు అందించే పనులు చురుకుగా కొనసాగుతున్నాయి.

## దక్షిణ తెలంగాణ అభివృద్ధిపై వివక్ష

– రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి



అభివృద్ధి అంతా ఉత్తర తెలంగాణ ప్రాంతంలోనే జరుగుతోంది. దక్షిణ తెలంగాణ ప్రాంత అభివృద్ధిపై వివక్ష చూపిస్తున్నారు. ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు పనులు గత కాంగ్రెస్ హయాంలో శంకర్‌పల్లి వరకు పనులు జరిగాయి. ప్రాజెక్టు నమూనా మార్చి ప్రాజెక్టు నీళ్లను ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీష్‌రావులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకు తరలించే ప్రయత్నం చేస్తున్నారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సాగునీరు అందిస్తామంటున్నారు. భారీ వరదలు వచ్చి కర్ణాటక ప్రభుత్వం గేట్లు ఎత్తితేనే నీళ్లు వస్తాయి. అసలు హక్కు ఉన్నదాన్ని వదిలేసి హక్కులు లేనివి ఇప్పిస్తామంటున్నారు. కొందుర్గు మండలం లక్ష్మీదేవిపల్లి దగ్గర 2.8 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్‌ను నిర్మిస్తామని చెప్పినా నేటికీ అతిగతీ లేదు. రూ.1500 కోట్లతో పాలమూరు- రంగారెడ్డి, రూ.500 కోట్లతో కుల్కచర్ల మండలం అంతారంలో ప్రాజెక్టుల నిర్మాణానికి టెండర్లు పిలుస్తామని ఎప్పటికప్పుడు వాయిదా వేస్తున్నారు. ఆడలేక మద్దెల దరువు అన్నట్లు అభివృద్ధి పనులకు కాంగ్రెస్ అడ్డంకిగా మారిందని అడ్డగోలు విమర్శలు చేస్తున్నారు. తొలిసారి స్వాతంత్ర్య వేడుకలు ఏం అభివృద్ధి సాధించారని ఘనంగా జరుపుకోవాలో అర్థం కావడం లేదు.

## ప్రజల వద్దకు పాలన వచ్చింది

– కె.యాదవరెడ్డి, శాసనమండలి సభ్యుడు



జిల్లాల ఏర్పాటుతో ప్రజల వద్దకే పాలన వచ్చింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందుతున్నాయి. నేడు అన్ని రంగాల్లో రాష్ట్రం పురోగమిస్తున్న తీరే ఇందుకు నిదర్శనం. జిల్లాల ఏర్పాటుతో సత్వర అభివృద్ధి దిశగా గ్రామాలు దూసుకెళ్తున్నాయి. సకాలంలో వివిధ పథకాల కింద లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియ వేగవంతమైంది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సాగు, తాగునీరు ఇబ్బందులు తలెత్తకుండా మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమం విజయవంతం చేయడానికి అందరి సహకారం అవసరం. భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణం అందించడానికి జరుగుతున్న కృషికి సహకరించడం అందరి బాధ్యత. తొలిసారిగా జరుపుకుంటున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జిల్లాకే తలమానికం కానున్నాయి. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి జరుగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.



జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముస్తాబయ్యాయి. పాఠశాలలు, మండల, గ్రామస్థాయి కార్యాలయాలను రంగు రంగుల కాగితాలతో అలంకరించారు. కుల్కచర్ల ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు సోమవారం ఇలా అలంకరణ పనుల్లో నిమగ్నమయ్యారు.

## అందరికీ ప్రభుత్వ చేయూత: యాదయ్య, ఎమ్మెల్యే, చేవెళ్ల



తెరాస ప్రభుత్వం అందరికీ చేయూతనిస్తోంది. ఊహించని రీతిలో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి దేశంలోని మిగతా రాష్ట్రాలకు ఆదర్శవంతంగా నిలుస్తోంది. నేడు తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి పనులపై దేశప్రజలు దృష్టి సారిస్తున్నారు. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, వ్యవసాయరంగానికి నిరంతర విద్యుత్తు సరఫరా వంటి పథకాలు విజయవంతంగా కొనసాగుతూ అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కలిగిస్తున్నాయి. రుణమాఫీని అమలు చేసి వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాయితీ రుణాలు అందించి ఆర్థికంగా ఉపాధి కల్పించే ఎన్నో కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కులవృత్తులకు తగిన ఆదరణ లభించింది. హరితహారం కార్యక్రమం విజయవంతం చేయడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృతనిశ్చయంతో ఉన్నారు. హరిత తెలంగాణతో పాటుగా బంగారు తెలంగాణ సాధించే దిశగా ప్రభుత్వం దూసుకెళ్తోంది.

# సంరక్షణం.. లోకక్షేమం ప్రాణామం

కంటోన్మెంట్, న్యూస్‌టుడే

నగరంలో మనిషి ఆరోగ్యకరమైన ఊపిరి పీల్చుకోవాలంటే మొక్కలకు, చెట్లకు ఊపిరులూదాలి. మొక్కలను నాటాం.. పనైపోయింది.. అనుకోకుండా మొక్క నాటి.. వృక్షంగా ఎదిగేలా.. నీళ్లు పోసి.. పశువుల బారిన పడకుండా ట్రీగార్డును ఏర్పాటు చేసి.. ఇంట్లో పసిపిల్లల్లా బాధ్యతాయుతంగా సాకితే .. అప్పుడు నగరజీవికి ప్రాణాధారమవుతాయి. ఈ బాధ్యతలను సికింద్రాబాద్ కార్ఖానాలోని వెంకటరాంనగర్ కాలనీకి చెందిన ప్రభాకర్ తాళ్లూరి ఆధ్వర్యంలోని 'లోకక్షేమం ఫౌండేషన్' సంస్థ నిర్వర్తిస్తూ మన్ననలు అందుకుంటోంది. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరముందని భావించారాయన. స్నేహితులతో కలిసి స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను శుభ్రపరిచారు... ఇంకుడు గుంతలను తవ్వించారు... మొక్కలను నాటడంతోపాటు వాటిని సంరక్షిస్తున్నారు. గత వైభవంగా ఉండే ఆహ్లాదకర, పర్యావరణహితమైన నగర వాతావారణాన్ని పునరుద్ధరించడమే లక్ష్యంగా సంస్థ సభ్యులు పనిచేస్తున్నారు. కుటుంబ పోషణకు ఆయన ప్రైవేటు సంస్థలో విధులు నిర్వర్తిస్తున్నారు. మరోవైపు 'లోకక్షేమం ఫౌండేషన్' ద్వారా స్వచ్ఛంద కార్యక్రమాలను చేపడుతున్నారు.

### ఇంకుడుగుంతలు 70 ఏర్పాటు

తన స్నేహితులతో కలిసి 2015లో సికింద్రాబాద్‌లో లోకక్షేమం ఫౌండేషన్‌ను ప్రభాకర్ ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఓలిఫెంటా బ్రిడ్జి పరిసరాలతోపాటు నగరంలోని వివిధ ప్రధాన రహదారుల్లో అపరిశుభ్రంగా ఉండే పాదబాటలను శుభ్రపరిచేవారు. సంస్థ తరఫున జూపార్కు, పాత కమిషనరేట్ కార్యాలయం, గోషామహల్ పోలీస్ మైదానాలతోపాటు పోలీసు శాఖకు సంబంధించిన వివిధ కార్యాలయాలతోపాటు మారేడుపల్లి, కొంపల్లి, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల్లో సుమారు 70 ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయించి ప్రముఖుల ప్రశంసలు పొందారు. అనంతరం సుచిత్ర చౌరస్తా సమీపంలోని గాయత్రినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన 200 మొక్కలకు క్రమం తప్పకుండా నీరుపోస్తు వాటిని సంరక్షించారు. సుచిత్ర చౌరస్తా మొదలు కొంపల్లి వరకు 44వ నెంబరు జాతీయ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన 500లకుపైగా మొక్కలను సంరక్షించే బాధ్యతను చేపట్టారు. ఈమేరకు 1,000 లీటర్ల సామర్థ్యం కలిగిన ఓ వాటర్ ట్యాంకు వాహనం ద్వారా పేట్ బషీరాబాద్ ఠాణాలోని బోర్‌వెల్, గాయత్రినగర్ సమీపంలోని వాటర్ ప్లాంట్ల నుంచి నీరు తీసుకొని మొక్కలను సంరక్షిస్తున్నారు.



రహదారి పక్కన ట్రీగార్డులు, దాతల పేర్లతో ఉన్న మొక్కలు



ప్రభాకర్

- మొక్కలకు నీళ్లు పోసి.. ట్రీగార్డులు బిగించి కాపాడుతున్న సంస్థ
- ఇంకుడుగుంతల ఏర్పాటు, స్వచ్ఛ పాదబాటల సేవానిరతి

కంటోన్మెంట్ ప్రాంతంలోని గన్‌రాక్ ఎన్‌క్లేవ్, ఏడబ్ల్యూహెచ్‌వో ఏ, బీ, సీ సెక్టార్ కాలనీల్లో బోర్డు యంత్రాంగం 'హరితహారం' కార్యక్రమంలో భాగంగా గత సంవత్సరం 800 మొక్కలను ఏర్పాటు చేయించింది. ఫౌండేషన్ సంవత్సరంపాటు నీరందించింది. పలువురు పర్యావరణ ప్రేమికులు ఇందుకుగాను విరాళాలను అందించేందుకు ముందుకొచ్చారు. ఒక్క మొక్కను నాటి ట్రీగార్డును ఏర్పాటు చేసి, సంవత్సరంపాటు సదరు మొక్కకు నీరందించేందుకు రూ. 900 ఖర్చవుతుందని ప్రభాకర్ ద్వారా తెలుసుకుని, నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 100మందికి

### ఆన్‌లైన్ విరాళం.. మొక్కలకు 'జియోట్యాగ్'

పైగా పౌరులు ఆన్‌లైన్ ద్వారా సంస్థకు విరాళాలను అందజేశారు. కంటోన్మెంట్‌లోని గన్‌రాక్ ఎన్‌క్లేవ్‌లోని అంతర్గత రహదారుల్లో రోడ్డుకు ఇరువైపులా 115 మొక్కలను వాటి చుట్టూరా ట్రీగార్డులను ఏర్పాటు చేయించి దాత పేరుతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయించారు. మొక్కకు సంబంధించిన స్థితిగతులను ఫొటోల రూపంలో ఎప్పటికప్పుడు ఆయా దాతలకు పంపిస్తున్నారు. దాతలు తమ మొక్కలను చూసుకునేందుకు చిరునామా ఇబ్బంది కాకుండా ఏర్పాటు చేశారు. పూర్తి వివరాలను గూగుల్‌లో అందుబాటులో ఉన్న 'జియో ట్యాగ్'కు అనుసంధానం చేశారు. దీనిద్వారా దాతలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి మొక్కల వద్దకు చేరుకోవచ్చని ఆయన చెబుతున్నారు. ఒకవేళ ఏదైనా కారణం వల్ల దాత అందించిన విరాళంతో ఏర్పాటు చేసిన మొక్క చనిపోతే తిరిగి వారివద్ద నుంచి డబ్బులను తీసుకోకుండానే ఆ స్థానంలో సంస్థ తరఫున మరో మొక్కను ఏర్పాటు చేసి దాన్ని సంరక్షిస్తున్నట్లు ఆయన వివరించారు.

# త్వరలో.. 30 కి.మీ.

- పట్టాలెక్కనున్న మెట్రో
- మియాపూర్ నుంచి నాగోల్ వరకు పనుల పూర్తికి సీఎం ఆదేశం
- యుద్ధప్రాతిపదికన అమీర్‌పేట ఇంటర్‌ఛేంజ్ స్టేషన్ నిర్మాణం

ఈనాడు, హైదరాబాద్



మెట్రో రైలును పాక్షికంగా అందుబాటులోకి తెచ్చేందుకు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మియాపూర్ నుంచి నాగోల్ వరకు రాకపోకలు ప్రారంభించడానికి రెండు కారిడార్లలోని మిగిలిన పనులను సత్వరం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు హైదరాబాద్ మెట్రోరైలు, ఎల్ అండ్‌టీ మెట్రోరైలు అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో కారిడార్-1లో మియాపూర్ - అమీర్‌పేట ..13 కి.మీ., కారిడార్-3లో నాగోల్ - అమీర్‌పేట.. 17 కి.మీ. మార్గాలను సిద్ధం చేస్తున్నారు. నవంబరు నెలాఖర్లో ప్రధాని ప్రారంభించే అవకాశం ఉందని సీఎం పేర్కొన్నట్లు సమాచారం. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలించాలని సీఎం మంత్రి కేటీఆర్‌కు సూచించారు.

ఈ మార్గాలు అందుబాటులోకి వస్తే మియాపూర్‌లో మెట్రో ఎక్కితే నాగోల్ వరకు చేరుకోవచ్చు. కాకపోతే అమీర్‌పేట ఇంటర్‌ఛేంజ్ స్టేషన్‌లో దిగి రైలు మారాల్సి ఉంటుంది. మెట్రో అనుకున్న సమయానికి ప్రారంభం కావాలంటే ప్రస్తుతం అమీర్‌పేట ఇంటర్‌ఛేంజ్ స్టేషన్ కీలకం కావడంతో ఇక్కడ 24 గంటలూ 800 మంది కార్మికులు శ్రమిస్తున్నారు. పనులను మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి ఆదివారం ఇంజినీర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎండీ వెంట ఎల్ అండ్‌టీ మెట్రో ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.పి.నాయుడు, చీఫ్ ఇంజినీర్ డీవీఎస్ రాజు, ఎస్ఈ విష్ణువర్ధన్‌రెడ్డి, జీఎం బి.ఎన్.రాజేశ్వర్, సీనియర్ ఇంజినీర్లు, అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

- ప్రయాణికులు ఒక కారిడార్ నుంచి మరొక కారిడార్‌లోకి మారడానికి అనువుగా విశాలమైన మెట్లు, స్కైవేస్ సౌకర్యాలు కల్పించాలని ఇంజినీర్లను ఆదేశించారు.
- నిరక్షరాస్యులు, శారీరక వైకల్యమున్న వారికీ అర్థమయ్యేలా సులభమైన సంకేతాలను ఏర్పాటు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.
- రోజుకు 30వేల మంది ప్రయాణికులు ఈ స్టేషన్‌ని ఉపయోగిస్తారని, వారికి ఇబ్బందులు లేకుండా ఉండేలా ఖాళీ స్థలాలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, మెట్లు సిద్ధం చేయాలన్నారు.
- రహదారి మార్గంలో పాదచారుల బాటలు, బస్సులు, ఆటో, ఇతర వాహన మార్గాలను అనుసంధానించే విధంగా సర్వీస్ రోడ్లు, ఫీడర్ బస్సు సౌకర్యాలకు రూపకల్పన, సుందరీకరణ పనులకు ట్రాఫిక్ నిపుణుల సంప్రదించాలని నిర్దేశించారు.
- అమీర్‌పేట స్టేషన్‌కు ప్రయాణికులు చేరుకోవడానికి వీలుగా గ్రీన్‌ల్యాండ్స్, పంజాగుట్ట, యూసుఫ్‌గూడ, మైత్రివనం, ఎస్ఆర్‌నగర్ ప్రాంతాల నుంచి వాహనాల రాకపోకలకు వీలుగా కూడళ్లను అనుసంధానం చేయాలన్నారు.

### ఇలా ఉంటుంది...

- *అమీర్‌పేట ఇంటర్‌ఛేంజ్ స్టేషన్ కారిడార్-1 (మియాపూర్- ఎల్‌బీనగర్), కారిడార్-3 (నాగోల్-రాయదుర్గం) అనుసంధానించే ఒక ప్రత్యేకమైన స్టేషన్. 2 లక్షల చ.అ.విస్తీర్ణంలో ఎన్నో ప్రత్యేక వసతులతో నిర్మిస్తున్న ఈ స్టేషన్ దేశంలోనే అతి విశిష్టమైన మెట్రో స్టేషన్‌గా మెట్రో ఎండీ పేర్కొన్నారు.*
- *ఫ్లాట్‌ఫారం ఎత్తు 92 అడుగులు .. పైకప్పు ఎత్తు 112 అడుగులు. ఆధునిక విమానాశ్రయాలను తలపించేలా అధునాతనమైన ఉక్కు స్తంభాలతో, రూఫింగ్ పరికరాలతో నిర్మాణం చేపడుతున్నారు.*
- *స్టేషన్ మూడు అంతస్తుల్లో నిర్మిస్తూ అనుసంధానిస్తున్నారు. పైన కారిడార్-1 వెళితే.. కింద కారిడార్-3 రైళ్లు వెళతాయి. సాంకేతిక హంగులతో గదులు, ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ గేట్లు, టికెటింగ్ గదులు ఉంటాయి. ఇరువైపులా 16 లిఫ్టులు, 12 ఎస్కలేటర్లు, 12 మెట్ల దారులు ఏర్పాటు చేస్తారు.*

# మహా మార్పు!

**అనుమతుల తిప్పలు తప్పాయ్ ● తెలంగాణ ఎక్స్‌లెన్స్ పురస్కారానికి ఎంపిక**

**ఈనాడు, హైదరాబాద్:** హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ)లో మహా 'మార్పు' . అనుమతుల తిప్పలు తప్పాయ్. కార్యాలయాల చుట్టు చెప్పులరిగేలా తిరగాల్సిన పని లేదు. అడిగినంత మాముళ్లు సమర్పించుకొని జేబులు గుల్ల చేసుకోనక్కర్లేదు. కూర్చున్న చోటు నుంచే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ధ్రువీకరణ పత్రాలను పొందొచ్చు. ఇది నిజం. డెవలెప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టం(డీపీఎంఎస్) ప్రజల కష్టాలకు చెక్ పెట్టింది.. రాష్ట్ర ప్రభుత్వంచే శభాష్ అనిపించుకుంది. ఈ ఏడాది తెలంగాణ ఎక్స్‌లెన్స్(టెక్స్) పురస్కారానికి ఎంపికైంది.

**ఒకప్పుడు..!** హెచ్ఎండీఏ పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో లేఅవుట్లను అభివృద్ధి చేయాలన్నా.. 12 మీటర్ల ఎత్తుకు మించి భవనాలు నిర్మించాలన్నా కచ్చితంగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. వీటితోపాటు భూ వినియోగ మార్పిడి, పెట్రోల్ బంకుల ఏర్పాటు, ఆక్యుపెన్సీ తదితర ధ్రువపత్రాల కోసం వందల కొద్దీ దరఖాస్తులు వస్తుంటాయి. ఇదే హెచ్ఎండీఏకు ప్రధాన ఆదాయ వనరు. వీటన్నింటిని నిబంధనల ప్రకారం 30 రోజుల్లో పరిష్కరించాలి. పర్యవేక్షణ లేమిని ఆసరాగా చేసుకోని సంబంధిత అధికారులు రెచ్చిపోయేవారు. దరఖాస్తుదారుల నుంచి అందిన కాడికి దండుకునేవారు. అనుమతుల కోసం వెళ్తే జేబులు గుల్ల కావడం ఖాయమన్న భావన నెలకొంది. అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయిన హెచ్ఎండీఏకు ఆదాయం తగ్గిపోయింది.

**ఇప్పుడు..!** ప్రధాన ఆదాయ వనరు అనుమతుల ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతున్నట్లుగా హెచ్ఎండీఏ కమిషనర్ చిరంజీవులు గుర్తించారు. ప్రజలకు భరోసా కల్పించేలా ఏం చేస్తే బాగుంటుందనే అంశంపై కసరత్తు చేశారు. చివరకూ మాన్యువల్‌గా కాకుండా ఆన్‌లైన్‌లోనే అనుమతులను జారీ చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు నయా విధానం డీపీఎంఎస్‌కు శ్రీకారం చుట్టారు. ఇంటి దగ్గరే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేసి.. నిర్ణీత రుసుం చెల్లిస్తే సరి. సరాసరి ఆ దరఖాస్తు సంబంధిత అధికారి వద్దకు వెళ్తుంది. అంతా సక్రమమే అనుకుంటే అనుమతులు ఇచ్చేస్తారు. ఆ సమాచారం దరఖాస్తుదారుడికి చేరవేస్తారు. అనుమతి పత్రాలను ఆన్‌లైన్‌లోనే ప్రింట్ అవుట్ తీసుకోవచ్చు. ఒకవేళ ఏమైనా పత్రాలు అవసరమైతే వాటిని అందజేయాల్సిందిగా అధికారులు సూచిస్తారు. పది రోజుల్లోపే అనుమతులను జారీ చేసేస్తున్నారు.

| అంశాలు | వచ్చిన దరఖాస్తులు | అనుమతి ఇచ్చినవి |
|---|---|---|
| భవన నిర్మాణాలు | 681 | 340 |
| భూ వినియోగ మార్పిడి | 104 | 32 |
| లేఅవుట్లు | 194 | 103 |
| గేటెడ్ కమ్యూనిటీ | 19 | 05 |
| ఎన్‌వోసీ(పెట్రోల్ పంపులు) | 18 | 08 |
| ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ | 05 | 02 |

(గమనిక: వివరాలు ఈ నెల 13 వరకు)

**ఆ అవకాశం లేదు..!** డీపీఎంఎస్‌తో ఇంకో అంశమేమిటంటే.. పదే పదే అవి లేవు.. ఇవి లేవంటూ తిప్పలు పెట్టే అవకాశం లేదు. ప్లానింగ్ అధికారికి ఒక్కసారి మాత్రమే కొర్రీ పెట్టొచ్చు. రెండోసారి నేరుగా ప్లానింగ్ డైరెక్టర్‌కు వెళ్లిపోతుంది. అక్కడ కూడా దరఖాస్తు పరిష్కారం కాకపోతే నేరుగా కమిషనరే పరిశీలిస్తారు. ఇదీ కాకుండా తమ దరఖాస్తు ఏ దశలో ఉందో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు. ఎందుకు తిరస్కరించారో కూడా సవివరంగా పేర్కొంటారు. ఎవరైనా పరిశీలించుకోవచ్చు. కమిషనర్ చిరంజీవులు ఆరా తీస్తున్నారు. జాప్యం చేస్తున్న సిబ్బందిపై దృష్టి పెడుతున్నారు. నయా విధానంతో హెచ్ఎండీఏ అంటే ప్రజల్లో భరోసా పెరిగిందనే చెప్పాలి. ఇన్నోవేషన్ విభాగంలో రాష్ట్ర ప్రభుత్వం డీపీఎంఎస్‌ను ఈ ఏడాది తెలంగాణ ఎక్స్‌లెన్స్ పురస్కారానికి ఎంపిక చేసింది. ఆగస్టు 15న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఈ అవార్డును కమిషనర్ చిరంజీవులు స్వీకరించనున్నారు.

# చేజారిన చేవాణి



# చేతికోస్తోంది!

చేవాణితో ప్రతి ఒక్కరికీ విడదీయరాని బంధం ఏర్పడింది. డిజిటల్ లావాదేవీలు పెరిగాక వినియోగం, అవసరం మరింత ఎక్కువైంది. ఈ నేపథ్యంలో మీరు కష్టపడి కొనుక్కున్న మీ కలల చేవాణిని చోరులు కొల్లగొట్టారు. మీరు డీలా పడిపోయారు. కష్టపడి కొన్నాం.. ఎంతో సమాచారాన్ని పొందుపరిచాం.. ఇప్పుడెట్లా అని బాధపడిపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేయకుండా.. ఫిర్యాదు మాత్రమే తీసుకున్నారు. కేసు నమోదు చేస్తే బీమా వచ్చే అవకాశం ఉందన్న మీ ఆశలు అడియాశలయ్యాయి. చేవాణి చోరీ సంఘటనల్లో బాధితుల పరిస్థితి మెజార్టీ ఇలాగే ఉంది. ఎస్సార్‌నగర్ నేర విభాగం పోలీసులు చేస్తున్న కృషి కారణంగా 6 నెలల్లో 300 మంది బాధితుల చేవాణులు చేజిక్కడం విశేషం.



పోయిన ఫోన్‌ను అందజేస్తున్న పోలీసు అధికారులు

న్యూస్‌టుడే, అమీర్‌పేట

చోరీకి గురైన చేవాణి ఐఎంఈఐ నంబర్లను పోలీసులు అన్ని మొబైల్ సంస్థల సర్వీస్ ప్రొవైడర్లకు పంపుతారు. సర్వీస్ ప్రొవైడర్లతో పోలీసులు వ్యవహరించే తీరు కూడా పోయిన చేవాణిలను గుర్తించడంలో ఎంతో కీలకం. దొంగిలించిన ఫోన్లను చోరులు ఎట్టి పరిస్థితుల్లో వినియోగించరు. ఎవరికో ఒకరికి అమ్మేస్తారు. ఇలా కొన్న ఫోన్లలో ఏఏ నెట్‌వర్క్‌లకు చెందిన నంబర్లను వాడుతున్నారో సర్వీస్ ప్రొవైడర్లు పోలీసులకు అందిస్తారు. చరవాణి ఎక్కడుందో, ఎవరి చేతుల్లో ఉందో తెలుసుకునే పోలీసులు చాకచక్యంగా వ్యహరించి వారిని కనిపెట్టి స్వాధీనం చేసుకుంటున్నారు. ఎస్సార్‌నగర్ పోలీసులు ఈ ప్రక్రియలో సమర్థంగా వ్యవహరిస్తుండటం వల్ల, పోయిన పలు చరవాణులను తిరిగి స్వాధీనం చేసుకోగలుగుతున్నారు. అత్యంత ఖరీదైన పలు బ్రాండ్ల ఫోన్లను స్వాధీనం చేసుకోగలిగారు.

### ప్రయోగం విజయవంతం

చరవాణుల చోరీ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన ఎస్సార్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సతీష్, డీఎస్సై శ్రీనివాస్ వాటిని కనిపెట్టడం కోసం ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఎప్పటికప్పుడు సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా సమాచారం సేకరిస్తారు. సమాచారం ఆధారంగా తమ సిబ్బందిని పంపుతూ చరవాణులను స్వాధీనం చేసుకుంటున్నారు. చోరీ చేసిన ఫోన్లను అమాయకంగా, తెలియక కొనుగోలు చేసిన వారిని పోలీసులు వదిలేస్తున్నారు. తమకు ఫోన్ అమ్మిన వ్యక్తిని కొనుగోలుదారులు గుర్తించే పక్షంలో నిందితులను, కావాలనే చోరీ ఫోన్‌లను కొనుగోలు చేసేవారిని పోలీసులు అరెస్టు చేస్తున్నారు. ఇటీవల 15 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

- సత్ఫలితాలనిస్తున్న ఎస్సార్‌నగర్ పోలీసుల ప్రయోగం
- 6 నెలల్లో 300 సెల్‌ఫోన్లు స్వాధీనం.. తిరిగి అప్పగింత
- ఆనందం వ్యక్తం చేస్తున్న సంబంధికులు



### శభాష్ శ్రీనివాస్

ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన హోంగార్డు శ్రీనివాస్‌కు ప్రత్యేకించి పోయిన చరవాణులను గుర్తించే పనిని అప్పగించారు. అతను 24 గంటల పనిచేస్తూ ఉన్నతాధికారుల ప్రశంసలందుకుంటున్నాడు. ఇటీవల రూ.3 లక్షల విలువ చేసే 20 ఖరీదైన చేవాణులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా శ్రీనివాస్ పని తీరును ప్రశంసించారు. క్రైం విభాగంలో కంప్యూటర్‌పై పనిచేస్తూ పోయిన చరవాణుల ఐఎంఈఐ నంబర్లును ఆయా సర్వీస్ ప్రొవైడర్లకు పంపడం, తిరిగి వాటి సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించడం, పోయిన చరవాణి ఏ ప్రాంతంలో ఉందో గుర్తించడం, వివరాలను అధికారులకు అందిస్తుండటంతో స్వాధీనం చేసుకొనే ప్రక్రియ సులభతరంగా మారిందని డీఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

### రహదారులపైనే విక్రయం

చోరీ చేసిన చరవాణులను దొంగలు ఎక్కువగా రోడ్లపైనే విక్రయిస్తుంటారు. ఇందుకు వారు బాలలను ఎంచుకుంటున్నారు. తమ ఇంట్లో ఇబ్బందులున్నాయని, తల్లిదండ్రులు అనారోగ్యంతో బాధపడుతున్నారని, తమ వద్ద ఉన్న విలువైన చేవాణిని తక్కువ ధరకే ఇస్తామని చెప్పే బాలలు అమాయకులకు చరవాణులను అంటగడుతుంటారు. ఇలా కొనేవారే ఎక్కువగా మోసపోతున్నారు. మరి కొన్ని సందర్భాల్లో చోరీ ఫోన్లను రాష్ట్రం దాటిస్తుంటారు. నగరంలోని జగదీష్ మార్కెట్‌లో చోరీ చేవాణులను కొనుగోలు చేసే రెండు ముఠాలు పనిచేస్తున్నాయని ఎస్సార్‌నగర్ పోలీసులు గుర్తించారు.

### నగరంలో సంచరిస్తున్న ముఠాలు

మల్లేపల్లి సమీపంలోని మాంగార్ బస్తీ, మీర్‌పేట సమీపంలోని నందనవనం ప్రాంతాలకు చెందిన కొన్ని ముఠాలు నగరంలో చరవాణులను ఎక్కువగా చోరీ చేస్తున్నాయని ఎస్సార్‌నగర్ పోలీసులు గుర్తించారు. రద్దీ ప్రాంతాలతో పాటు రైతుబజార్లు, బల్కంపేట ఎల్లమ్మ దేవస్థానం, రద్దీ బస్‌స్టాప్‌లు, వారాంతపు సంతల వద్ద వీరు హస్తలాఘవం ప్రదర్శిస్తున్నారు. తస్కరించడంలోనూ ఈ ముఠాలు చిన్నారులను వాడుకొంటున్నారు. ఒక్క ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లోనే చరవాణి చోరీలపై రోజూ 5-6 ఫిర్యాదులందుతుండడం గమనార్హం.

### నమ్మలేకపోయాను: లావణ్య

ఎంతో ఇష్టంతో కొనుక్కున్న ఫోన్ పోవడంతో ఏడుపొచ్చింది. పోలీసులకైతే ఫిర్యాదు చేశాను కాని దొరుకుతుందనే నమ్మకం లేదు. అయితే ఫోన్ దొరికిందని, వచ్చి తీసుకుపొమ్మని ఠాణా నుంచి ఫోన్ వస్తే నమ్మలేకపోయాను. తిరిగి ఫోన్ దక్కడం ఎంతో సంతోషంగా ఉంది.

### నాన్న ప్రేమగా కొనిచ్చారు: మజర్

నాన్న ఎంతో ప్రేమగా ఫోన్ కొనిచ్చారు. ఇటీవల బస్సులో ప్రయాణిస్తుండగా దాన్ని ఎవరో దొంగిలించారు. చాలా బాధేసింది. పోలీసులకు ఫిర్యాదు చేశాను. మరో ఫోన్ కొనుక్కుందామనుకునేలోపు తన ఫోన్ దొరికినట్టు కబురొచ్చింది. ఎంతైనా నాన్న కొనిచ్చిన ఫోన్ కదా... ఆనందంగా ఉంది.

# సుపరిణామం..!



- అంతటా పెరుగుతున్న 'హాజరు'
- విధులకు సకాలంలో అధ్యాపకులు
- ఇంజినీరింగ్‌లో సక్రమంగా తరగతులు
- జేఎన్‌టీయూహెచ్‌లో ఫలితాలిస్తున్న బయోమెట్రిక్

ఈనాడు, హైదరాబాద్

జేఎన్‌టీయూహెచ్‌కు న్యాక్ గుర్తింపులో మంచి గ్రేడ్ వచ్చేందుకు బయోమెట్రిక్ విధానం కలిసిరానుంది. వర్సిటీ వీసీగా ఎ.వేణుగోపాల్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటినుంచి బయోమెట్రిక్ విధానంపై దృష్టి పెట్టారు. తరగతులు సక్రమంగా జరగాలంటే అధ్యాపకులు సకాలంలో విధులకు హాజరుకావాలని గుర్తించారు. బయోమెట్రిక్ విధానాన్ని బోధకులకు తొలుత అమలులోకి తీసుకొచ్చారు. తర్వాత విద్యార్థులకు ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించారు. ఇదే విధానాన్ని అన్ని అనుబంధ గుర్తింపు కళాశాలలకు విస్తరించారు. ఆయా కళాశాలల్లో అధ్యాపకుల సమాచారాన్ని కంప్యూటరీకరించారు. వారి హాజరుశాతాన్ని ఎప్పటికప్పుడు వర్సిటీకి అనుసంధానం చేసే విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు. ఫలితంగా జేఎన్‌టీయూహెచ్‌తో పాటు అనుబంధ గుర్తింపుతో నడుస్తున్న కళాశాలల్లో అధ్యాపకులు సకాలంలో విధులకు హాజరవుతున్నారు. గతంతో పోల్చితే తరగతులు దాదాపు చాలాచోట్ల సక్రమంగా జరుగుతున్నాయి. దీంతో విద్యార్థులు సమయానికి తరగతులకు హాజరవుతున్నారు. ఛాయిస్‌బేస్డ్ క్రెడిట్‌సిస్టమ్(సీబీఎస్ఈ) విధానం అమలుతో డిటెన్షన్ తెరమీదకు వచ్చింది. ఏ తరగతులోనైనా కనీసం 50శాతం గ్రేడ్ పాయింట్లను విద్యార్థి సాధించకపోతే తర్వాతి ఏడాదిలోకి ప్రవేశించేది లేదు. దీంతో విద్యార్థులు చదువుపై దృష్టిపెడుతున్నారు. ప్రతి సెమిస్టర్‌లోను ఆయా గ్రేడ్‌పాయింట్లు ఎంతో కీలకంగా మారాయి. విద్యార్థి ఆ గ్రేడ్‌పాయింట్లును సాధించకపోతే ఏడాది వృథాకానుంది. ప్రతీ ఏడాదిలో గ్రేడ్‌పాయింట్లు ఎంతో ముఖ్యం. దీంతో జేఎన్‌టీయూహెచ్‌తోపాటు అనుబంధ గుర్తింపుతో నడుస్తున్న పలు కళాశాలల్లో విద్యార్థులు సక్రమంగా హాజరుకావడం వర్సిటీకి మంచి పరిణామంగా మారింది. ఇది వర్సిటీకి న్యాక్‌లో మంచి గ్రేడ్ వచ్చేందుకు దోహదపడనుంది.

### ఫీజు రీఎంబర్స్‌మెంటుకు ఇదే ముఖ్యం..

అన్ని కళాశాలల్లో బయోమెట్రిక్ విధానం విధిగా అమలుచేయాల్సిందేనని ప్రభుత్వం పేర్కొంది. విద్యార్థులకు 75 శాతం హాజరు ఉంటేనే బోధనా రుసుం చెల్లించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఫీజు రీఎంబర్స్‌మెంట్‌లో అక్రమాలను తెరపడనుంది. విద్యార్థులు సక్రమంగా తరగతులకు రాకున్నా.. కొన్ని కళాశాలల యాజమాన్యాలు ఫీజు రీఎంబర్స్‌మెంటు నిధులే లక్ష్యంగా హాజరును వేసేస్తున్నారనే ఆరోపణలు ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అన్ని కళాశాలల్లో బయోమెట్రిక్ విధానం విధిగా అమలు చేయాలని ఆదేశాలను ప్రభుత్వం జారీచేసింది. దీన్ని జేఎన్‌టీయూహెచ్.. పరిగణనలోకి తీసుకొంది. బయోమెట్రిక్ విధానాన్ని ఈ ఏడాది నుంచి అమలు చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే అధ్యాపకులకు విధిగా అమలు చేస్తోంది.

### ఉత్తీర్ణతకు కీలకంగా మారిన హాజరు..

'పదోతరగతి మాదిరిగా కాకుండా కళాశాల స్థాయికి వస్తే తరగతులకు విద్యార్థులు ఎప్పుడైనా వెళ్లచ్చు.. తరగతి గదులనుంచి ఎప్పుడైనా బయటకు వచ్చేయవచ్చు..' అనే విధానానికి జేఎన్‌టీయూహెచ్ తెరవేసింది. విద్యార్థులు సక్రమంగా తరగతులకు హాజరైతేనే నాణ్యమైన విద్య పొందగలరనే ఉద్దేశంతో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని వర్సిటీ అధికారులు అమలులోకి తీసుకొచ్చారు. ఇప్పటికే అధ్యాపకులకు అమలులోకి తెచ్చారు. విద్యార్థులకు అమలుచేసేందుకు రంగం సిద్ధం చేసుకోవాలని అన్ని కళాశాలలకు వర్సిటీ ఆదేశించింది. కొత్త విధానంతో సకాలంలో తరగతులు జరుగుతున్నాయి. విద్యార్థులు దాదాపు తరగతి గదుల్లో ఉంటున్నారు. 75శాతం హాజరు ఉంటేనే విద్యార్థులు ఇక నుంచి పరీక్షలు రాసేందుకు అర్హులు. ఏదైన అనారోగ్యపరమైన ఇబ్బందులు ఉంటే విద్యార్థికి మరో పదిశాతం మినహాయింపు ఇవ్వనున్నారు. అంటే 65శాతం హాజరు తప్పనిసరిగా అందరు విద్యార్థులకు ఉండాల్సిందే. లేదంటే పరీక్షలకు అనుమతించరు. ఈ విధానం అమలులోకి రావడంతో విద్యార్థులు తరగతి గదుల్లోనే ఉంటున్నారు. పెరిగిన హాజరు విధానం న్యాక్ గ్రేడ్‌కు కలిసొచ్చే అంశంకానుంది.



### న్యాక్‌లో మంచి గ్రేడ్ సాధించడమే లక్ష్యం..

**-ఎన్.యాదయ్య, రిజిస్ట్రార్, జేఎన్‌టీయూహెచ్**

ఈనెల 17నుంచి న్యాక్ బృందం వర్సిటీలో పర్యటించనుంది. జేఎన్‌టీయూహెచ్‌కు మంచి గ్రేడ్ తేవడంపై అందరూ దృష్టి సారించాం. 2004లో న్యాక్ ఏ గ్రేడ్ వచ్చింది. 2008లో వర్సిటీ నాలుగుగా విడిపోయింది. నాటి నుంచి ఇప్పటివరకు జేఎన్‌టీయూహెచ్‌కు న్యాక్ గుర్తింపు లేదు. ఇదే తొలి గుర్తింపు కానుంది. యూజీసీ తదితర అన్ని నిధులకు న్యాక్ గుర్తింపు తప్పనిసరి. వర్సిటీ విద్యార్థులకు ఈ గుర్తింపు ఎంతగానో దోహదపడుతుంది. ఇవన్నీ దృష్టిలోపెట్టుకొని వర్సిటీకి మంచి గ్రేడ్ వచ్చేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే వర్సిటీలో విద్యార్థులకు ఎన్నో వసతులు కల్పించాం. ఆచార్యులు అందరూ కూడా మంచి గ్రేడ్ వచ్చేందుకు పూర్తి సహకారాన్ని అందిస్తున్నారు.

# స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపే కళాఖండాల ప్రదర్శన

**హైదరాబాద్:** సాలార్ జంగ్ మ్యూజియంలో 71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన సందర్శకులకు స్వాతంత్ర సంగ్రామ స్ఫూర్తిని కల్పిస్తుంది. 1857 నుంచి 1947 వరకు భారత్ సాగించిన స్వాతంత్ర పోరాట ఘట్టాల కళాఖండాలు ప్రదర్శనలో చోటు చేసుకున్నాయి. భారత్ స్వాతంత్ర తొలి సంగ్రామ ఘట్టాలతో పాటు స్వాతంత్రమే నా జన్మహక్కు అంటూ.. ఎంతో మంది స్వాతంత్ర సమరయోధులు సాగించిన పోరాటాల ఘట్టాల చిత్రాలు ప్రదర్శనలో చోటు చేసుకున్నాయి. 1857లో సిపాయిల తిరుగుబాటు.. టిప్పు సుల్తాన్ సైనిక బలగాలు బ్రిటీష్ సైన్యంతో వీరోచితంగా పోరాటం సాగించిన చిత్రాలు.. మహాత్మాగాంధీ అహింసా మార్గంలో స్వాతంత్ర్య పోరాటాన్ని ఉద్ధృతంగా కొనసాగించిన తీరు.. ఝాన్సీ లక్ష్మి బాయి తదితర భారతీయ నారీమణులు సైతం వీరోచితంగా స్వాతంత్ర సంగ్రామం సాగించిన తీరును కళ్లకు కట్టే పలు చిత్రాలు ప్రదర్శనలో చోటు చేసుకున్నాయి. స్వాతంత్ర పోరాటాల ఘట్టాలను విశదీకరించే 80 కళాఖండాలు ప్రదర్శనలో ఉన్నాయి. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని రగిలించే ఈ ప్రత్యేక ప్రదర్శన ఈనెల 21వ తేదీ వరకు కొనసాగుతుందని మ్యూజియం అధికారులు వివరించారు.

# ప్రతిభ

**ఆగస్టు 8: రాష్ట్రీయం**

### తెలుగు రాష్ట్రాల మధ్య బదిలీలకు అనుమతి

♦ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు అంతర్రాష్ట్ర బదిలీలకు అనుమతినిస్తూ, దీనికి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేశాయి. భార్యాభర్తల బదిలీలు, స్థానిక (జిల్లా, జోనల్, బహుళ జోనల్), కేంద్రం ఆమోదం పొందిన రాష్ట్ర స్థాయి కేటగిరీల్లో పరస్పర బదిలీలకు అనుమతి లభించింది. ప్రభుత్వ శాఖలతో పాటు స్థానిక సంస్థల ఉద్యోగులకు కూడా ఇవి వర్తిస్తాయి. తెలుగు రాష్ట్రాల విభజన సందర్భంగా కమలనాథన్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగుల విభజన జరిగింది. 58, 42 శాతం దామాషాలో కేటాయింపులు జరిపారు. వివిధ కారణాలతో చాలామంది ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి బదిలీలను కోరారు. దీనిపై గవర్నర్ నరసింహన్ నేతృత్వంలో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరిగింది. ఇద్దరు సీఎంలు అంతర్రాష్ట్ర బదిలీలకు ఆమోదం తెలిపారు.

# ‘సంకల్పం నుంచి సిద్ధి వరకు’ నినాదం ఎవరిది?

## కరెంట్ అఫైర్స్

## జాతీయం

**ఆగస్టు 4**

### నావిక్‌కు భారత పరమాణు గడియారాలు

♦ సొంత జీపీఎస్ వ్యవస్థ (నావిక్)లో స్వదేశీకరణ దిశగా భారత్ కీలక ముందడుగు వేసింది. నావిక్‌కు భారత పరమాణు గడియారాల ద్వారానే సమయాన్ని అందించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు చెందిన ఇస్ట్రాక్ సెల్, దిల్లీలోని నేషనల్ ఫిజికల్ ల్యాబొరేటరీ (ఎన్‌పీఎల్) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ఇస్రోకు అత్యంత కచ్చితమైన సమయాన్ని ఎన్‌పీఎల్ అందిస్తుంది. ఇది అందించే భారత ప్రామాణిక సమయానికి (ఐఎస్‌టీ) అనుగుణంగా ‘నావిక్’ సమన్వయమవుతుంది.

**ఆగస్టు 7**

### అగర్తలాలో ఎల్‌పీజీ బాట్లింగ్ కర్మాగారం



♦ రూ. 143 కోట్లతో అగర్తలాలో నిర్మించనున్న ఎల్‌పీజీ బాట్లింగ్ కర్మాగారానికి కేంద్ర చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శంకుస్థాపన చేశారు. ఈశాన్య రాష్ట్రాలకు ఎదురవుతున్న వంట గ్యాస్ కొరతను అధిగమించడానికి చిట్టగాంగ్ నుంచి త్రిపుర వరకు సహజ వాయువు గొట్టపు మార్గాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. పశ్చిమ్ బంగలోని సిలిగురి నుంచి బంగ్లాదేశ్‌లోని పార్వతీపూర్ వరకు డీజిల్ చేరవేయడానికి గొట్టపు మార్గాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. గృహావసరాల కోసం పేదలు వినియోగించే కిరోసిన్, వంటగ్యాస్ సిలిండర్లపై రాయితీ కొనసాగుతుందని ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు.

**ఆగస్టు 8**

### అయోధ్యకు పరిష్కారం

♦ అయోధ్యలో వివాదాస్పద స్థలానికి సముచిత దూరంలో ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతంలో మసీదును నిరభ్యంతరంగా నిర్మించుకోవచ్చంటూ ఉత్తర్ ప్రదేశ్ షియా సెంట్రల్ వక్ఫ్‌బోర్డు సుప్రీంకోర్టుకు తన అభిప్రాయాన్ని సూచనప్రాయంగా తెలిపింది. ఈ వ్యవహారంలో వివిధ హిందూ సంస్థలు చేస్తోన్న డిమాండ్‌కు మద్దతుగా ముందుకొచ్చిన తొలి ముస్లిం సంస్థ యూపీ షియా బోర్డే అవుతుంది. అయితే అదే సమయంలో బాబ్రీ మసీదు స్థలం తమ సొంత ఆస్తి అని, ఈ వివాదానికి సామరస్యపూర్వక పరిష్కారానికి చర్చలు జరిపే హక్కు తమకు మాత్రమే ఉందని కూడా వక్ఫ్‌బోర్డు స్పష్టం చేసింది.

**ఆగస్టు 9**

### క్విట్ ఇండియా ఉద్యమ 75వ వార్షికోత్సవం

♦ క్విట్ ఇండియా దినోత్సవ 75 వ వార్షికోత్సవాన్ని దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ‘సంకల్పం నుంచి సిద్ధి వరకు’ అనే నినాదాన్ని ఇచ్చారు. పీడిస్తోన్న సమస్యల నుంచి దేశానికి విముక్తి కల్పించి, 2022 నాటికి సరికొత్త భారతావనిని తీర్చిదిద్దడానికి ప్రజలు ప్రతిజ్ఞ తీసుకోవాలని మోదీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రూపొందించిన ఎనిమిది తపాలా బిళ్లలను రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఎట్‌హోం కార్యక్రమంలో విడుదల చేశారు.

### గుజరాత్ రాజ్యసభ ఎన్నికలు

♦ గుజరాత్ నుంచి రాజ్యసభకు జరిగిన ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాయి. భాజపా నుంచి బరిలో దిగిన జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ సునాయాసంగా గెలుపొందగా, మూడో అభ్యర్థి బల్వంత్ సింగ్ రాజ్‌పుత్ మాత్రం ఓటమి పాలయ్యారు. సోనియా గాంధీ రాజకీయ కార్యదర్శి అహ్మద్ పటేల్ వెంట్రుకవాసిలో ఓటమిని తప్పించుకుని విజయం సాధించారు. గెలవడానికి అవసరమైన 44 ఓట్లను దక్కించుకున్న పటేల్ అయిదోసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు.

**ఆగస్టు 10**

### హమీద్ అన్సారీ పదవీ విరమణ

♦ రెండు విడతల్లో పదేళ్లపాటు రాజ్యసభ ఛైర్మన్, ఉపరాష్ట్రపతి హోదాల్లో సేవలందించిన మహ్మద్ హమీద్ అన్సారీ పదవీ కాలం పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో ఆయనకు రాజ్యసభ ఘనంగా వీడ్కోలు పలికింది.

### పెరగనున్న కేంద్ర ప్రభుత్వ వ్యయం

♦ కేంద్ర ప్రభుత్వ వ్యయం 2019-20 ఆర్థిక సంవత్సరం నాటికి రూ. 26 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉందని పార్లమెంటుకు సమర్పించిన ఆర్థికశాఖ అధికార పత్రం వెల్లడించింది. మూలధన వ్యయం 25% పెరిగి, ఆ ఆర్థిక సంవత్సరం నాటికి రూ. 3.9 లక్షల కోట్లకు చేరుతుందని, ఒక్క రక్షణ రంగ వ్యయమే 22% పెరుగుతుందని ఈ నివేదిక పేర్కొంది. రెవెన్యూ వ్యయంతో కలిపి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఖర్చు రూ. 21.46 లక్షల కోట్లుగా, వచ్చే ఏడాది రూ. 23.4 లక్షల కోట్లుగా ఉంటుందని తెలిపింది.

**ఆగస్టు 11**

### వెంకయ్య నాయుడు ప్రమాణ స్వీకారం

♦ దేశ 15 వ ఉపరాష్ట్రపతిగా (వ్యక్తుల పరంగా 13) తెలుగుబిడ్డ ముప్పవరపు వెంకయ్య నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లోని దర్బార్ హాల్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. వెంకయ్య భగవంతుడి పేరిట ప్రమాణం చేశారు.

♦ ఉపరాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం రాజ్యసభ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంకయ్య నాయుడు రాజ్యసభ కార్యకలాపాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులనుద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు.

## అంతర్జాతీయం

**ఆగస్టు 6**

### ఉత్తర కొరియాపై ఆంక్షలు

♦ ఉత్తర కొరియాపై కఠిన ఆంక్షలను విధిస్తూ అమెరికా రూపొందించిన ఒక తీర్మానానికి ఐరాస భద్రతా మండలి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. దీనివల్ల ఉత్తర కొరియాకు ఏటా 100 కోట్ల డాలర్ల మేర ఆదాయాన్నిచ్చే ఎగుమతులపై నిషేధం అమలవుతుంది. అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టాక ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా చేపట్టిన మొదటి చర్య ఇదే. దీనికి ఉత్తర కొరియా మిత్రపక్షం చైనా కూడా మద్దతు తెలపడం విశేషం.

**ఆగస్టు 7**

♦ వివాదాస్పద దక్షిణ చైనా సముద్రంలో చైనా కృత్రిమ దీవులను ఏర్పాటు చేయడం, వాటిపై నిర్మాణాలు చేపట్టడం, సైనికీకరణను అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా ఖండించాయి. మనీలాలో జరిగిన ఆసియాన్ విదేశాంగ మంత్రుల సదస్సు సందర్భంగా కొన్ని ఆసియాన్ దేశాలు దక్షిణ చైనా సముద్ర వివాదం విషయంలో చర్చలపై చైనా విధి విధానాలకు అంగీకారం తెలిపాయి. ఇలా చైనా పట్ల ఆసియాన్ వైఖరి మెత్తబడిన తరుణంలో ఈ మూడు దేశాలు ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.

**ఆగస్టు 9**

### వీసా రహిత ప్రవేశాన్ని ప్రకటించిన ఖతార్

♦ భారత్‌తో సహా 80 దేశాల ప్రజలకు వీసా రహిత ప్రవేశానికి అనుమతి ఇస్తున్నట్లు ఖతార్ ప్రకటించింది. ఈ 80 దేశాల ప్రజలు ఖతార్ చేరుకున్న వెంటనే అక్కడికక్కడే పర్యటక వీసాలను మంజూరు చేస్తారు.

## వార్తల్లో వ్యక్తులు

**ఆగస్టు 5**

### నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్‌గా రాజీవ్ కుమార్



♦ నీతి ఆయోగ్ తదుపరి వైస్ ఛైర్మన్‌గా డాక్టర్ రాజీవ్ కుమార్‌ను నియమిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆక్స్‌ఫర్డ్‌లో ఆర్థిక శాస్త్రంలో డీఫిల్, లఖ్‌నవూ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేసిన రాజీవ్ కేంద్ర విధానాల పరిశోధన సంస్థలో సీనియర్ ఫెలోగా ఉన్నారు. గతంలో ఫిక్కీకి సెక్రటరీ జనరల్‌గా, భారతీయ అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల పరిశోధన మండలికి చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశారు.

**ఆగస్టు 8**

### ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా



♦ సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా నియమితులయ్యారు. ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్ ఈనెల 27 న పదవీ విరమణ చేస్తోన్న నేపథ్యంలో ఈ నియామకం జరిగింది. దీపక్ 1977 లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. 1996 లో ఒడిశా హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 1997 లో మధ్యప్రదేశ్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2009 లో పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2010 లో దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2011 లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

## రాష్ట్రీయం - తెలంగాణ

**ఆగస్టు 8**

### వయోపరిమితికి మరో రెండేళ్లు..

♦ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఇతర నియామక సంస్థల ద్వారా భర్తీ అయ్యే ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల గరిష్ఠ వయో పరిమితి పెంపుదలను మరో రెండేళ్లు అమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. సాధారణ నియామకాలకు మాత్రమే పెంపుదల వర్తిస్తుందని, పోలీసు, అబ్కారీ, అటవీ, అగ్నిమాపక, జైళ్ల శాఖల్లాంటి యూనిఫాం సర్వీసులకు వర్తించదని పేర్కొంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత నిరుద్యోగుల వినతి మేరకు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న 34 ఏళ్ల గరిష్ఠ వయోపరిమితిని 44 ఏళ్లకు పెంచుతూ 2017 జులై 27 న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ గడువు 2017 జులై 26 తో ముగిసిపోయింది. తాజాగా దీన్ని మరో రెండేళ్లపాటు అంటే 2019 జులై 26 వరకూ అమలు చేసేందుకు ఆదేశాలిచ్చింది.

**ఆగస్టు 10**

### ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకానికి శంకుస్థాపన

♦ ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకానికి సంబంధించిన వరద కాలువ వద్ద ఏర్పాటు చేసిన పైలాన్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించారు. అనంతరం పోచంపాడు వద్ద గోదావరి ఒడ్డున ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. మేడిగడ్డ నుంచి తరలించే జలాలతో 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించారు. ప్రధాన గోదావరిలో ఎగువ రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి చుక్కనీరు రాకపోయినా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, కాలువలు నిత్యం జలకళతో ఉట్టిపడేలా రూ. 2 వేల కోట్లతో ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

## రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్

♦ విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీకి (ఐఐపీఈ) జాతీయ ప్రాధాన్యత హోదా కల్పిస్తూ లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందింది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని 13 వ షెడ్యూల్‌లో పేర్కొన్న హామీ ప్రకారం కేంద్ర ప్రభుత్వం గతేడాది విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఐఐపీఈని ప్రారంభించింది. మిగతా జాతీయ విద్యా సంస్థల్లాగే డిగ్రీలు ప్రదానం చేసే స్వయం ప్రతిపత్తి కల్పించడానికి ఈ బిల్లును ఉద్దేశించారు.

**ఆగస్టు 6**

### చిత్తూరు జిల్లాలో ఈ – క్లస్టర్

♦ చిత్తూరు జిల్లాలో 501 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న ఎలక్ట్రానిక్ ఉపకరణాల తయారీ క్లస్టర్ (ఈ-క్లస్టర్)కు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ తుది అనుమతులు జారీచేసింది.

**ఆగస్టు 8**

### విజయవాడలో విద్యుత్‌సౌధ ప్రారంభం

♦ విజయవాడలోని గుణదలలో నిర్మించిన విద్యుత్ సౌధ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఏపీఎస్ఎల్‌డీసీ)ను సీఎం చంద్రబాబుతో కలిసి గవర్నర్ నరసింహన్ ప్రారంభించారు. సంతోషానికి చిహ్నంగా ఈ భవనాలకు ‘సమృద్ధి’ అనే పేరు పెట్టాలని గవర్నర్ సూచించారు.

**ఆగస్టు 9**

### ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

♦ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అరకులో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, గవర్నర్ నరసింహన్ పాల్గొన్నారు. రాష్ట్రంలో 34 తెగల్లో 27.39 లక్షల మంది గిరిజనులు ఉన్నారు. వీరి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూ. 3,520 కోట్లు కేటాయించినట్లు సీఎం తెలిపారు.



రచయిత
- సీహెచ్. కృష్ణప్రసాద్
విషయ నిపుణులు

# IBPS - RRBs Recruitment

No. of Questions: 80 | Maximum Marks: 80 | Time: 45 Mts.

ప్రతిభ

# IBPS Officers Prelims Model Paper - 2017



(నిన్నటి తరువాయి)

**Directions (Q.31 - 35):** Below is given a passage followed by several possible inferences which can be drawn from the facts stated in the passage. You have to examine each inference separately in the context of the passage and decide upon its degree of truth or falsity. Mark answer

1) If the inference is "definitely true" i.e. it properly follows from the statement of facts given.
2) If the inference is "probably true" though not "definitely true" in the light of the facts given.
3) If the data are inadequate i.e. from the facts given you cannot say whether the inference is likely to be true or false.
4) If the inference is "probably false" though not "definitely false" in the light of the facts given.
5) If the inference is "definitely false" i.e. it cannot possibly be drawn from the facts

**Note:** Each of the five questions has only one distinct answer i.e. no two questions can have the same answer. If you get same answer for more than one question, consider both again and decide which one of the two would more definitely be that answer and same way review other also.

The first time I saw The Wizard of Oz, the story bewitched me the second time I saw The Wizard of Oz, the special effects amazed me. The third time I saw The Wizard of Oz, the photography dazzled me. Have you ever seen a movie twice, three times? You notice subtleties and hear sounds you completely missed the first time around. It's the same on the phone. Be-cause your business conversations are more consequential than movies, you should listen to them two, may be three times. Often we have no clear idea of what really happened in our phone conversation until we hear it again. You'll find shadings more significant than the colour of Toto's collar - and more scarecrows than you imagined who 'haven't got a brain!' How do you listen to your important business conversations again? Simply legally and ethically tape record them. I call the technique of recording and analyzing your business conversations for subtleties Instant Replay.

**31.** The movie The Wizard of Oz' will help improve business conversation.

**32.** For most, if they watch a movie more than once, different aspects in different order, like special effects, photography, story, music etc. would impress in a better way.

**33.** The tips are given for understanding business conversation.

**34.** The advice is being given to the sales team.

**35.** The author watches most movies more than twice.

**Directions (Q.36 - 40):** In each of the questions/ set of questions below are given two statements followed by two conclusions numbered I and II. You have to assume everything in the statements to be true even if they seem to be at variance from commonly known facts and then decide which of the two given conclusions logically follows from the information given in the statement. Give answer

1) If only conclusion I follows.
2) If only conclusion II follows.
3) If either conclusion I or conclusion II follows.
4) If neither conclusion I nor conclusion II follows.
5) If both conclusions I and II follow.

**36. Statements:** Some pins are clips.
Some clips are pens.
**Conclusions:** I. Some pins are pens.
II. No pin is a pen.

**(Q.37-39):**
**Statements:** All D's are A's.
All A's are C's.

**37. Conclusions:** I. Some C's are D's.
II. Some A's are D's.

**38. Conclusions:** I. All D's are C's.
II. Some D's are not A's.

**39. Conclusions:** I. All A's are D's.
II. All C's are A's.

**40. Statements:** All doors are windows.
Some windows are clips.
**Conclusions:** I. Some clips are doors.
II. Some windows are doors.

## Quantitative Aptitude

**41.** 8 men can complete a piece of work in 20 days. 8 women can complete the same work in 32 days. In how many days will 5 men and 8 women together complete the same work?
1) 16 days 2) 12 days 3) 14 days
4) 10 days 5) None of these

**42.** The area of a square is 1024 sq. cm. What is the respective ratio between the length and the breadth of a rectangle whose length is twice the side of the square and breadth is 12 cm. less than the side of the square?
1) 5 : 18 2) 16 : 7 3) 14 : 5
4) 32 : 5 5) None of these


**43.** The sum of five consecutive even numbers of set-A is 220. What is the sum of a different set of five consecutive numbers whose second lowest number is 37 less than **double** of the lowest number of set -A?
1) 223 2) 225 3) 235
4) 243 5) None of these

**44.** The bus fare for one person is Rs. 420 from Agra to Aligarh and train fare between the same places for one person is equal to threefourth the bus fare for two persons between the same places. What is the total fare paid by 2 persons travelling by bus and 4 persons travelling by train between the two places?
1) Rs. 3,360 2) Rs. 3,460 3) Rs. 3,440
4) Rs. 3,406 5) None of these

**45.** The respective ratio between the speeds of a car, a jeep and tractor is 3 : 5 : 2. The speed of the jeep is 250 percent of the speed of the tractor which covers 360 km in 12 hours. What is the average speed of car and jeep together?
1) 60 km/hr. 2) 75 km/hr. 3) 40 km/hr.
4) Cannot be determined
5) None of these

**Directions (Q.46 - 50):** Study the following bar-graph carefully and answer the following questions.

*Earnings (in rupees) of three different persons on four different days*




**46.** What is Gita's average earnings over all the days together?
1) Rs.285 2) Rs.290 3) Rs.320
4) Rs.310 5) Rs.315

**47.** What is the total amount earned by Rahul and Naveen together on Tuesday and Thursday together?
1) Rs.1,040 2) Rs.1,020 3) Rs.980
4) Rs.940 5) Rs.860

**48.** Gita donated her earnings of Wednesday to Naveen. What was Naveen's total earnings on Wednesday after Gita's donation?
1) Rs.520 2) Rs.550 3) Rs.540
4) Rs.560 5) Rs.620

**49.** What is the difference between Rahul's earnings on Monday and Gita's earnings on Tuesday?
1) Rs.40 2) Rs.20 3) Rs.50
4) Rs.30 5) Rs.10

**50.** What is the respective ratio between Naveen's earnings on Monday, Wednesday and Thursday?
1) 7 : 3 : 5 2) 8 : 6 : 5 3) 8 : 7 : 4
4) 9 : 5 : 4 5) 9 : 3 : 4

**Directions (Q.51 - 55):** Study the following table carefully to answer the questions that follow:

*Monthly Rent (in Rs. thousands) at five different places in six different years*

| | Place | | | | |
|---|---|---|---|---|---|
| Years | Churchgate | Dadar | Kandivali | Borivali | Virar |
| 2005 | 5.3 | 3.8 | 1.5 | 2.7 | 1.1 |
| 2006 | 12.5 | 8.3 | 3.4 | 4.8 | 2.1 |
| 2007 | 16.7 | 11.7 | 5.5 | 6.6 | 1.8 |
| 2008 | 20.9 | 13.6 | 9.8 | 12.7 | 3.6 |
| 2009 | 25.8 | 14.5 | 11.5 | 14.1 | 5.5 |
| 2010 | 30.3 | 20.9 | 15.6 | 15.9 | 7.8 |

**51.** In which place the monthly rent did not increase consistently from year 2005 to 2010?
1) Churchgate 2) Dadar 3) Kandivali
4) Borivali 5) Virar

**52.** In which year at Churchgate, the monthly rent increased more than 100 percent from the previous year?
1) 2006 2) 2007 3) 2008
4) 2009 5) 2010

**53.** What was the difference between the monthly rent at Dadar in the year 2009 and Borivali in the year 2007?
1) Rs.7,600 2) Rs.7,900 3) Rs.8,100
4) Rs.8,600 5) None of these





**54.** Monthly rent at Kandivali in the year 2008 was approximately what percent of the total monthly rent at Virar over all the years together?
1) 30 2) 33 3) 38 4) 42 5) 45

**55.** Which city was most expensive in terms of rent?
1) Churchgate 2) Dadar 3) Kandivali
4) Borivali 5) Virar

**Directions (Q.56 - 60):** In the following questions two equations numbered I and II are given. You have to solve both the equations and - Give answer

1) If $x > y$ 2) If $x \geq y$
3) If $x < y$ 4) If $x \leq y$
5) If $x = y$ or the relationship cannot be established

**56.** I. $5x^2 - 18x + 9 = 0$
II. $20y^2 - 13y + 2 = 0$.

**57.** I. $x^3 - 878 = 453$
II. $y^2 - 82 = 39$

**58.** I. $\frac{3}{\sqrt{x}} + \frac{4}{\sqrt{x}} = \sqrt{x}$ II. $y^3 - \frac{(7)^{7/2}}{\sqrt{y}} = 0$

**59.** I. $9x - 15.45 = 54.55 + 4x$
II. $\sqrt{y + 155} - \sqrt{36} = \sqrt{49}$

**60.** I. $x^2 + 11x + 30 = 0$ II. $y^2 + 7y + 12 = 0$

**Directions (Q.61 - 65):** What will come in place of the question mark (?) in the following number series?

**61.** 7 20 46 98 202 (?)
1) 420 2) 410 3) 310
4) 320 5) None of these

**62.** 210 209 213 186 202 (?)
1) 138 2) 77 3) 177
4) 327 5) None of these

**63.** 27 38 71 126 203 (?)
1) 212 2) 202 3) 301
4) 312 5) None of these

**64.** 435 354 282 219 165 (?)
1) 103 2) 112 3) 120
4) 130 5) None of these

**65.** 4 200 369 513 634 (?)
1) 788 2) 715 3) 734
4) 755 5) None of these

**Key**

| | | | | |
|---|---|---|---|---|
| 31-5 | 38-1 | 45-1 | 52-1 | 59-5 |
| 32-4 | 39-4 | 46-2 | 53-2 | 60-3 |
| 33-1 | 40-2 | 47-4 | 54-5 | 61-2 |
| 34-2 | 41-1 | 48-3 | 55-1 | 62-2 |
| 35-3 | 42-5 | 49-1 | 56-1 | 63-5 |
| 36-3 | 43-5 | 50-5 | 57-2 | 64-3 |
| 37-5 | 44-1 | 51-5 | 58-5 | 65-3. |

( మిగతా ప్రశ్నలు రేపటి పేజీల్లో)

# దేశభక్తి ఉప్పొంగే ప్రదేశాలివి!



పంద్రాగస్టు అనగానే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజని ఎవర్ని అడిగినా చెబుతారు. దాన్ని సాధించడానికి జరిగిన ఉద్యమాలు... పోరాటం సాగించిన నేతలు గుర్తొస్తారు. మరి ఆనాటి పోరాటాలు జరిగిన ప్రదేశాలు మీకు తెలుసా? ఆ ప్రదేశాలను తల్చుకుంటే చాలు అప్పటి ఉద్యమాలు గుర్తొచ్చి దేశభక్తి ఉప్పొంగుతుంది. అవే ఇవి!



## బారక్‌పూర్, పశ్చిమ్‌బంగ

ప్రథమ స్వాతంత్ర్య సమరం మొదలైంది ఇక్కడి నుంచే. తన కమాండర్లపై మంగళ్ పాండే తిరుబాటు చేస్తున్నట్టు ప్రకటించడంతో 1857 సిపాయీల తిరుగుబాటు ప్రారంభమైంది. బ్రిటిష్ పాలకులపై దాదాపు రెండు వందల ఏళ్లపాటు సాగిన పోరాటానికి ఇదే తొలిమెట్టు.

## ఝాన్సీ, ఉత్తర్ ప్రదేశ్



రాణి ఝాన్సీ లక్ష్మీ బాయికి చెందిన ఈ నగరంలో సిపాయీల తిరుగుబాటు మరో మలుపు తిరిగి పాలకులపై యుద్ధంగా మారడానికి వేదికైంది.

## చంపారన్, బిహార్



గాంధీజీ తొలి విజయానికి వేదిక ఇది. బ్రిటిష్‌వారు ఆహార ధాన్యాలకు బదులు వాణిజ్యపంటల్ని పండించమని బలవంతం చేశారు. గాంధీజీ భారత దేశానికి తిరిగొచ్చాక ఈ అంశంపై వ్యతిరేకిస్తూ చంపారన్ సత్యాగ్రహం నిర్వహించారు. ఇలా అహింసా ఉద్యమం మొదలైంది.



## జలియన్ వాలా బాగ్, పంజాబ్

తెల్ల దొరల దురాగతానికి నిదర్శనంగా నిలిచిన ప్రాంతమిది. ఏప్రిల్ 13, 1919లో బ్రిటిష్ సైనికులు డయ్యర్ ఆధ్వర్యంలో అమాయక ప్రజలపై కాల్పులు జరిపారు. ఈ దుర్ఘటనలో 379 మంది మరణించారు. 1200 మందికి పైగా గాయాల పాలయ్యారు.



## చౌరీ చౌరా, ఉత్తర్ ప్రదేశ్

1922లో సహాయ నిరాకరణ ఉద్యమం ఉధృతంగా జరుగుతున్నప్పుడు ఈ ప్రాంతం వార్తల్లోకెక్కింది. పోలీసుల దౌర్జన్యాలపై ఆగ్రహించిన ప్రజలు చౌరీ చౌరా పోలీస్ స్టేషన్ని దహనం చేశారు. కొంతమంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో గాంధీజీ ఆ ఉద్యమాన్ని నిలిపివేశారు.

## కాకొరి, ఉత్తర్ ప్రదేశ్




ఉద్యమాల కోసం డబ్బు అవసరమయ్యింది. దీంతో 1925 ఆగస్టు 9న బ్రిటిష్ ప్రభుత్వం రవాణా చేస్తున్న నిధి నుంచి ఉద్యమకారులు ఎనిమిది వేల రూపాయల్ని లూటీ చేశారు. ఈ సంఘటన ప్రభుత్వాన్ని కలవరపెట్టింది. చరిత్రలో బ్రిటిష్‌వారి సంపద లూటీ జరగడం ఇదే ప్రథమం.

## దండి, గుజరాత్



స్వాతంత్ర్య సమరంలో ముఖ్య ఘట్టమైన ఉప్పు సత్యాగ్రహం జరిగింది ఇక్కడే. 1930లో ఉప్పుపై పన్ను పెంచినందుకు నిరసనగా దాన్ని ప్రభుత్వ వ్యతిరేకతకు సాధనంగా గాంధీజీ ఈ ఉద్యమాన్ని నిర్వహించారు. భారత స్వాతంత్ర్య పోరాటంపై బ్రిటిష్ వారి దృక్పథం మారడానికి ఇది ఎంతో దోహద పడింది.

## చీరాల - పేరాల, ఆంధ్రప్రదేశ్




స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు వారి పోరాట పటిమకు చీరాల - పేరాల కేంద్రంగా నిలిచాయి. స్వాతంత్ర్య సమరయోధుడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిందిది. అసలు ఉద్యమం ఎలా వచ్చిందంటే... 1919లో బ్రిటిష్ ప్రభుత్వం (గతంలో గుంటూరు జిల్లా) ప్రకాశం జిల్లాలోని చీరాల-పేరాల గ్రామాలను కలిపి పురపాలక సంఘంగా చేయడంతో ప్రజలపై పన్నుల భారం అధికమైంది. ఈ రెండు గ్రామాల్లోని 15,000 జనాభా ఆదాయం నాలుగు వేల రూపాయలు. కానీ బ్రిటిష్‌వారు పన్నుల పేరుతో నలభైవేల రూపాయలు లాక్కునే ప్రయత్నాలు చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ పురపాలక సంఘం రద్దు చేయాలని ప్రజలంతా ఉద్యమించారు. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నాయకత్వంలో ఆందోళన మొదలుపెట్టారు. వేయి మంది సభ్యులతో 'రామదండు' అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. విజయవాడ కాంగ్రెస్ సమావేశాల సందర్భంగా గాంధీజీ వచ్చినప్పుడు సమస్యను ఆయనకు వివరించారు. మహాత్ముడు చీరాలను సందర్శించి ఊరు ఖాళీ చేస్తే మున్సిపాలిటీ దానంతట అదే రద్దవుతుందనే సూచన ఇచ్చారు. దీంతో ఆ రెండు గ్రామాల ప్రజలు ఊరు వదిలేసి పక్కనే ఉన్న ప్రదేశంలో 'రామ్‌నగర్' పేరుతో కొత్త నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. 11నెలల పాటు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉద్యమాన్ని కొనసాగించారు.

# హాయ్! బుజ్జీ!!

ఎప్పుడూ నిజం మాట్లాడితే కష్టాల్లో అందరూ మనకు తోడుగా ఉంటారు

- గాంధీజీ

## పదసంపద!



రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Pull = లాగు
- అపరాధం = తప్పు

## నవ్వుల జల్లులు!



**వనజ:** దుస్తులుతకవే అంటే ఇంటికి తీసుకెళతానంటావేంటి?

**పనిమనిషి:** ఇప్పుడివి ఉతికే ఓపిక లేదమ్మా. మా ఇంట్లో వాషింగ్ మెషీన్‌లో వేసి తెస్తా!

- పీవీ రమణకుమార్, చిలకలూరి పేట



బాజీ రౌత్ కథ విన్నారా?


అతనెవరా? చిన్నవయసులోనే ప్రాణాలను సైతం లెక్కచేయక బ్రిటిష్ వాళ్లను ఎదిరించాడు. స్వాతంత్ర్యం కోసం అతను చేసిన త్యాగానికిగానూ తన పేరుతో పురస్కారాలూ ఇస్తున్నారు. ఇంకా బోలెడు కబుర్లున్నాయ్...

**బాలభారతం**

ఆగస్టు సంచికలో

bb@ramojifoundation.org
Cell: 80085 51844

## చిలిపి ప్రశ్న



నింగీ నేలా కలిసేదెప్పుడు?

- కృష్ణవేణి, విశాఖపట్నం

## ఏమిటిది?

పదాల అమరికను బట్టి వచ్చే పదబంధాన్ని కనిపెట్టగలరా?




## బొమ్మల్లో ఏముంది?

బొమ్మల ఆంగ్ల పేర్లు గడుల్లో రాసి రంగు గడుల్లోని అక్షరాల్ని వరుసగా చదివితే ఓ సందేశం వస్తుంది.


1

2

3

4

5

6

7

8


9

10

11

12

13

14

15

జవాబులు: **బొమ్మల్లో ఏముంది:** 1. Bird 2. Nose 3. Dove 4. Bear 5. Jeep 6. Cave 7. Corn 8. Door 9. Tree 10. Neck 11.Cart 12. Gems 13. Hand 14. Ball 15. Yawn **దాగిన సందేశం:** INDEPENDENCE DAY **చిలిపిప్రశ్న:** కలిపి రాసినప్పుడు! **ఏమిటిది:** Get up and go

# హామీలు నేరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

**బంట్వారం, న్యూస్‌టుడే:** మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు నేర్చవేర్చడంలో తెరాస ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని బొపునారం గ్రామంలో ప్రజల వద్దకు ప్రసాద్‌కుమార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధే తప్ప తెరాస చేసింది ఏమీ లేదన్నారు. ప్రతి పేదవాడికి రెండు పడక గదుల ఇళ్లు ఇస్తామని చెప్పి, నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా జిల్లాలో ఇప్పటికీ ఒక్క ఇల్లు మంజూరు కాలేదన్నారు. రైతులకు రుణమాఫీ చేశామని చెబుతున్న ప్రభుత్వం మంజూరు చేసిన డబ్బులు వడ్డీలకే సరిపోయాయని పేర్కొన్నారు. రైతుల ఆత్మహత్యల విషయంలో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో నిలిచిందన్నారు. భూమి లేని ఎస్సీ ఎస్టీలకు మూడెకరాల పొలం ఇస్తామని, తండాలను గ్రామ పంచాయితీలుగా గుర్తిస్తామని చెప్పినా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని సాధ్యం కాని మాటలు చెప్పి రాజకీయ లబ్ధి కోసం గారడీ చేస్తుందన్నారు. తెరాస ప్రభుత్వం చేపడుతున్న అక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని, సమయం కోసం వేచిచుస్తున్నారన్నారు. అనంతరం గ్రామస్థులు గ్రామంలో అల్ప విద్యుత్తు సమస్య ఉందని, గ్రామానికి మరో బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం, గ్రామ సర్పంచి, పద్మమ్మ, నాయకులు మోగులయ్య, నర్సింలు, సుదర్శన్, పురుషోత్తం, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బొపునారంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్

## ఈటీవీలో ఈనాడు

**స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈటీవీ ప్రత్యేక కార్యక్రమాలు**

**ఉదయం**

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: కుజ, రాహు, కేతు గ్రహాలు అనుకూలించాలంటే... మంగళవారంరోజు ఏం చేయాలి?, ఆరోగ్యసిద్ధికి వాస్తురీత్యా ఏం చేయాలి?, 08-30: టాలీవుడ్ టైమ్: 09-00: స్పెషల్ ఈనాడు సినిమా: సర్దార్ పాపారాయుడు (ఎన్టీఆర్, శ్రీదేవి, శారద).

**మధ్యాహ్నం**

12-00: స్పెషల్ అభి'రుచి': సింగర్ దినకర్ అతిథిగా ఘుమఘుమలు 'కొబ్బరి క్యారెట్ పలావు', మీచేతివంట 'చాక్లెట్ కాఫీ', 'డ్రైఫ్రూట్ కస్టర్డ్ బిస్కెట్స్', జస్ట్ ఏ మినిట్ 'బేబీకార్న్ శాండ్‌విచ్' తయారుచేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్పెషల్ స్టార్ మహిళ: (మెగా గేమ్ షో) చైల్డ్ ఆర్టిస్ట్స్ స్పెషల్ ఎపిసోడ్..., 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి–2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

**సాయంత్రం**

04-00: వసంతం (డైలీ సీరియల్), 04-30: జబర్దస్త్ (రిపీట్), 05-30: జబర్దస్త్ జల్సా టైం (రిపీట్), 06-00: శ్రీ భాగవతం (భక్తి రసాత్మక దృశ్య కావ్యం), (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్)

**రాత్రి**

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: వీర – చిన్నారుల టాలెంట్ షో..., 10-30: 'ఫన్' డే (స్పెషల్ కామెడీ ప్రోగ్రాం).

## ఈటీవీ ప్లస్

**ఉదయం** 11:00 కిక్ రిపీట్
**మధ్యాహ్నం** 12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 అమ్మాయి క్యూటు అబ్బాయి నాటు రిపీట్
01:15 టాప్స్ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు
03:00 తారక్ మామా అయ్యో రామ రిపీట్
03:30 సినిమా చూపిస్త మావ రిపీట్

**సాయంత్రం**
04:30 నా షో నా ఇష్టం
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

**రాత్రి**
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 హంగామా
09:00 పటాస్
09:30 అల్లరే అల్లరి
10:00 సరదాగా కాసేపు
10:30 తారక్ మామా అయ్యోరామ రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

## ఈటీవీ లైఫ్

★ మానస (ఉ. 6:00, సా. 6.00, రా. 11.00)
★ డా. ఈటీవి (ఉ. 6:30, 11:00, మ. 3:30. రా. 7:30)
★ యోగమంత్ర (ఉ. 7:00, సా.5:30, రా. 10:30, 11:30)
★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)
★ అమృతం (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)
★ హెల్దీ & టేస్టీ – (ఉ. 8:30, మ. 01:00, రా. 8:30)
★ ఆరోగ్యమస్తు (ఉ. 09:00, 10:30, మ. 3:00, సా. 4:00, రా. 09:00)
★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్ (ఉ. 9:30, మ. 2:00, రా. 7:00)
★ బాడీ మైండ్ & సోల్–అంతరంగం (ఉ. 10:00, మ. 2:30, రా. 9:30)
★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
★ హెల్దీ డయాబెటిక్ (మ. 1:30)

## ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: ధర్మయుద్ధం (రజనీకాంత్, శ్రీదేవి), 10-00: మార్నింగ్ షో: ప్రమీలార్జునీయం (ఎన్టీఆర్, బి.సరోజ), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: చిత్రం భళారే విచిత్రం (నరేశ్, రాజీవి), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఐ లవ్ ఇండియా (శరత్‌కుమార్, ప్రియారామన్), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: రాజసింహ (కాంతారావు, వాణిశ్రీ), 10-00: మై ఛాయిస్ (స్పెషల్ ప్రోగ్రాం).

## ఈటీవీ అభిరుచి

**ఇండిపెండెన్స్ డే స్పెషల్స్**

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - ట్రై కలర్ కేసరి, స్వీట్ కార్న్ అండ్ క్యారట్ రైస్, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – ఫ్రూట్ అండ్ నట్ ప్యాన్ కేక్, ట్రై కలర్ స్వీట్ బేసిల్ దోస (ఇన్‌స్పెక్టర్ మాధవిలత), ఉ.10.00: ఆహారవీధిలో – ఫ్రోజెన్ డెసర్ట్ - ఎన్.యమ్.రాజేశ్వరీ - ఫౌండర్ ఆఫ్ "తోడు నీడ" ఆర్గనైజేషన్, ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు – తిరంగా ప్యూరీ, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ – జండా దోశ శశికళ స్వామి సోషల్ వర్కర్, ఉ.11.30, రా.8:00: బాబాయ్ హోటల్ - బాదుషా, సింగర్ సాహితి, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా - ట్రై కలర్ పేడ - సీఐ ధనలక్ష్మీ, మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – తిరంగా ఇడ్లీ - సింగర్ ధనుంజయ్, మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ - సపోటా లడ్డు, మ.12.45: సూప్స్ & స్టార్టర్స్ - ట్రై కలర్ పనీర్ టిక్కా, మ.1.00: వావ్ ఏమి రుచి (స్క్వేవర్స్ స్పెషల్) – తిరంగ్ పన్నీర్ స్క్వేవర్స్, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - తిరంగా కోకోనట్ స్వీట్ - జ్ఞానప్రసూన - సోషల్ వర్కర్, మ.1.45: ట్రెండీ ట్రీట్స్ – ట్రై కలర్ బిస్కెట్స్, మ.2.15: డిజైనర్ డిష్ – గిల ఫిలదోస్ - సిఐడి ఆఫీసర్ - ఉషశ్రీ, మ.2.30: చోటా చెఫ్ – ట్రై కలర్ ఖీర్.

## ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

**ఉదయం:** 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 ⁰, 08-30 యువ (రిపీట్), 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360 ⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ రాధారాస్ బిహారీజీ మందిరం, జుహలా, ముంబాయి, 5-00 ఘంటారావం, 05-30 అంతర్యామి (రిపీట్), 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 ⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్)

## ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

**ఉదయం:** 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 ⁰, 08-30 యువ (రిపీట్), 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360 ⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ రాధాగోవింద్‌జీ మందిరం, జైపూర్, రాజస్థాన్, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి (రిపీట్), 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 ⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

## ఏ ఛానల్లో ఏముంది.. 15-08-2017

**SVBC:** **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 ఇండిపెండెన్స్ డే సెలబ్రేషన్స్ - టీటీడీ విష్ణుసహస్రనామ స్తోత్రం, 07-30 లైవ్ ఇండిపెండెన్స్ డే సెలబ్రేషన్స్ - టీటీడీ - శ్రీవారి సేవలు(అష్టాదళ పాద పద్మారాధన సేవ), 08-00 శతమానంభవతి, 08-30 శ్రీకృష్ణ పూజాఫలం, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 రా..రా.. కృష్ణయ్య, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు + ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 కృష్ణం వందే జగద్గురు -శ్రీ మైలవరపు శ్రీనివాసరావు, 03-30 మురళీరవం, **సాయంత్రం:** 04-00 శ్రీదేవీ కటాక్షం, 04-30 మంగళగౌరివ్రత వైశిష్ట్యం - వద్దిపర్తి పద్మాకర్, 05-00 లైవ్ ఎస్.డి. సేవ - తిరుమల + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 శ్రీకృష్ణలీలామృతం, 08-00 భక్తి చైతన్యం, 08-30 శ్రీకృష్ణావతారం - చాగంటి, 09-00 శ్రీకృష్ణక్షేత్రం -ఉడిపి 09-30 శ్రీ క్రిష్ణతత్వం - శ్రీ సామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 గోకులాష్టమి.

**భక్తి TV:** **ఉదయం:** 06-00 ద్వారక జన్మాష్టమి (లైవ్), 07-00 అర్చన, 07-30 జయకృష్ణముకుందా మురారీ, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 శ్రీకృష్ణ శృంగార హారతి (లైవ్), 09-00 భజరే నందబాలం (లైవ్), 11.00 శ్రీకృష్ణహారతి (లైవ్), **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 తారంగం..తారంగం, 05-30 జయకృష్ణముకుందామురారీ, 06-00 శ్రీలలితాసహస్రం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 హరేకృష్ణ (లైవ్), 08-00 జన్మాష్టమి మహోత్సవం (లైవ్), 09-00 భజరే నందబాలం, 09-30 బృందావనం, 10-00 జన్మాష్టమి వైభవం, 11-30 మధురాభిషేకం (లైవ్).

**జీ తెలుగు:** **ఉదయం:** 07-00 టెలీషాపింగ్, 07-30 ఓంకారం, 08-00 సినిమా: లౌక్యం, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం (రిపీట్), 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: తడాఖా.

**మా:** **ఉదయం:** 07-00 మహాభారతం, 08-00రాశి ఫలాలు, 08-30 ఫన్ టైమ్, 09-00 సినిమా: ఎమ్.ఎస్.ధోని, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 సంసారం ఒక చదరంగం, 02-00 కుంకుమ పువ్వు, 02-30 బిగ్ బాస్ రిపీట్, **సాయంత్రం:** 04-00 సినిమా: మర్యాద రామన్న, 05-30 ఒకే జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీకళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమపువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్ బాస్, 10-30 బిగ్ బాస్ రిపీట్.

**GEMINI:** **ఉదయం:** 06-00 టెలి షాపింగ్ 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: కృష్ణగాడి వీర ప్రేమగాథ, 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి 02-30 నాగిని 2 రిపీట్, 03-00 సినిమా: లయన్, 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని 2, 08-00 నువ్వు నాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు, 10-00 సినిమా: ఊపిరి.

**HBO:** **ఉదయం:** 06-00 బ్లాక్ రెయిన్, 08-05 ది గాడ్‌ఫాదర్, 08-23 రష్ అవర్ 2, 10-03 టీనేజ్ మ్యూటంట్ నింజా టర్టిల్స్ : అవుట్ ఆఫ్ ది షాడోస్, మధ్యాహ్నం: 12-00 ట్రిపుల్ ఎక్స్, 02-08 బ్యాట్‌మ్యాన్ వర్సెస్ సూపర్‌మ్యాన్ : డాన్ ఆఫ్ జస్టిస్, సాయంత్రం: 04-49 సూసైడ్ స్క్వాడ్, 06-55 జాక్ రీచర్ : నెవర్ గో బ్యాక్, **రాత్రి:** 09-00 ఐరన్ మ్యాన్, 11-15 ది ట్రాన్స్‌పోర్టర్ రీఫ్యూల్డ్.



# పొద్దుతిరుగుడులో తెగుళ్ల యాజమాన్యం

పొద్దుతిరుగుడు పంటను ఆశించే తెగుళ్ళ, యాజమాన్య పద్ధతులను నర్సంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు తోట శ్రీనివాసరావు వివరించారు.

**నెక్రోసిస్ తెగులు:** ఈ తెగులు పంటను అన్ని కాలాల్లో ఏ దశలోనైన ఆశిస్తుంది. ఇది వైరస్ వల్ల వచ్చే తెగులు, తామరపురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. తెగులు సోకినప్పుడు ఆకుల మధ్య ఈనె దగ్గరగా ఉండే భాగం నల్లగా మారి, మాడిపోయి ఆకులు వంకరలు తిరిగి ఎండిపోతాయి. తెగులు ఆకు కాడకు, కాండానికి, పువ్వుకు వ్యాపించటం వలన ఆయా భాగాలు నల్లగా మాడి ఎండిపోతాయి. మొక్క సరిగా ఎదగక గిడసబారిపోతుంది. పుష్పం సరిగా విచ్చుకోక మెలితిరుగుతుంది. పుష్పభాగం దెబ్బతిని విత్తన వృద్ధి జరుగదు. దిగుబడి తగ్గుతుంది.

**యాజమాన్యం:** వేసవి దుక్కులు చేయాలి. పంట చుట్టు నాలుగు సాళ్లు జొన్న, సజ్జ, మొక్కజొన్న పంటలు వేయాలి. కిలో విత్తనానికి 5 గ్రా. ఇమిడోక్లోప్రిడ్‌తో విత్తనశుద్ధి చేసి, తొలిదశలో తామరపురుగు ఆశించకుండా నివారించవచ్చు. పొలంగట్ల మీద వయ్యారి భామ కలుపు మొక్కలను, పొలంలో తెగులు సోకిన పంట మొక్కలను పూత రాక ముందే పీకివేసి కాల్చివేయాలి. లీటరు నీటికి మెటాసిస్టాక్స్ 2 మి.లీ. లేదా 15 లీటర్ల నీటికి ఇమిడాక్లోప్రిడ్ 6 మి.లీ. కలిపి 15 రోజులకోసారి 3 లేదా 4 సార్లు పిచికారి చేయాలి.

**ఆకుమచ్చ తెగులు:** పొద్దుతిరుగుడు సాగు చేసిన 50-60 రోజుల వరకు ఈ తెగులు ఆశిస్తుంది. ముదురు గోదుమ, నల్లటి, గుండ్రని లేదా అండాకారపు మచ్చలు మొదట ఆకులపై ఏర్పడి తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ఈ మచ్చలు ఒకదానితో ఒకటి కలిసిపోయి ఆకు అంతా వ్యాపించి ఆకులు ఎండి రాలిపోతాయి. ఈ తెగులు లక్షణాలు ఆకుల పైనే కాకుండ పత్రవృత్తం, కాండం, పువ్వు వెనుక ఉండే ఆకుపచ్చని భాగాలపై ముదురుగోదుమ లేదా నలుపురంగు మచ్చల వలె కన్పిస్తాయి. తెగులు సోకిన పుష్పాలు కుళ్లిపోయే అవకాశం ఉంది. అందువల్ల గింజ నాణ్యత తగ్గి మొలకశాతం తగ్గుతుంది.



**యాజమాన్యం:** కిలో విత్తనానికి 2 గ్రా. ఇప్రోడైన్+కార్బండిజమ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి. పంటపై తొలిదశలో వ్యాధిని గుర్తించిన వెంటనే లీటరు నీటికి 2 గ్రా. ఇప్రోడియన్+కార్బండిజమ్ లేదా 1 మి.లీ. ప్రొపికొనజోల్ కలిపి 15 వ్యవధితో 2 సార్లు పిచికారి చేయాలి.

**బూడిద తెగులు:** ఆకుల పైన అడుగుభాగాన బూడిద లాంటి పొడితో కప్పబడిన చిన్న మచ్చలు ఏర్పడి క్రమేపి ఆకు అంతా బూడిద లాంటి పొడితో కప్పబడి ఉంటుంది. తెగులు తీవ్రత ఎక్కువైతే ఆకులు పసుపు రంగు లోకి మారి రాలిపోతాయి.

**యాజమాన్యం:** లీటరు నీటికి 3 గ్రా. నీటిలో కరిగే గంధకం పొడి లేదా 1 మి.లీ. డైనోక్యాప్ కలిపి పిచికారి చేయాలి.

**తుప్పు తెగులు:** చలికాలంలో ఈ తెగులు తీవ్రత అధికంగా ఉంటుంది. ఈ తెగులు మొదట కింది ఆకులపై చిన్న ఇటుక వర్ణపు పొక్కులుగా ఏర్పడి క్రమేపి పైఆకులకు, పుష్పం లోని పచ్చని భాగాలకు వ్యాపిస్తుంది. తెగులు తీవ్రత ఎక్కువైనప్పుడు వ్యాధి సోకిన భాగాలు తుప్పు వర్ణంలోకి మారి ఎండిపోతాయి.

**యాజమాన్యం:** థైరామ్ లేదా కాప్టాన్ 3 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి. మ్యాంకోజెబ్ 3 గ్రా. లేదా 2 గ్రా. జైనెబ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తలకుళ్లు లేదా పువ్వుకుళ్లు:** ఈ తెగులు ఎక్కువగా పూతదశలో వర్షాలు పడినప్పుడు ఆశిస్తుంది. తెగులు సోకిన పువ్వు కింది భాగం నీటిలో తడిసినట్లుండి తరువాత గోదుమరంగుకు మారుతుంది. ఈ భాగంపై దూదిపింజ లాంటి శిలీంధ్రం పెరుగుతుంది. ఇది పువ్వు అంతా వ్యాపించి పువ్వు కుళ్లిపోయి గింజలు నల్లటి పొడి ముద్దగా మారతాయి.

**యాజమాన్యం:** లీటరు నీటికి మెటలాక్సిల్ 1 గ్రా.+ నీటిలో కరిగే గంధకం 3 గ్రా. కలిపి 10 రోజుల వ్యవధితో రెండుసార్లు పిచికారి చేయాలి.

**బూజుతెగులు:** ఈ తెగులు సోకిన ఆకులు ఈనెల మధ్య పత్రహరితం కోల్పోయి లేత పసుపురంగు లోకి మారుతుంది. ఈనెలు ఉబ్బి ఆకులు కిందకు ముడుచుకొని ఉంటాయి. పుష్పాలు వంధత్వంగా మారి నిటారుగా ఉంటాయి. మొక్కల పెరుగుదల ఆగిపోయి గిడసబారుతాయి.

**యాజమాన్యం:** మెటలాక్సిల్ 3 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి. పంటపై మెటలాక్సిల్ (8 శాతం) 2 గ్రా. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

–న్యూస్‌టుడే, దుగ్గొండి.